


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162






ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 282 | గురువారం 22 - 10 -2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,


## మంగళగిరిలో వైసీపీకి షాక్..



### లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన కీలక నేత

మంగళగిరిలో టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

మంత్రి లోకేశ్ సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేత రజనీకాంత్

స్థానిక ఎన్నికల్లోనూ భారీ మెజార్టీతో గెలవాలని పిలుపు

మంగళగిరిలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న లోకేశ్

రజనీకాంత్‌తో పాటు టీడీపీ తీర్థం పుచ్చుకున్న 25 కుటుంబాలు

2లో

# నిత్యవసరాల ధరలకు కళ్లెం వేయండి

నిత్యవసరాల ధరల పెరుగుదలను నియంత్రించాలని సీఎం ఆదేశం

ఎల్ నినో ప్రభావం ప్రజలపై పడకుండా చర్యలు తీసుకోవాలని సూచన

పీఎం సూర్యఘర్ కనెక్షన్ల ఏర్పాటును వేగవంతం చేయాలన్న చంద్రబాబు

ఇసుక, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం

2లో



రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలపై భారం పడకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ధరలు పెరుగుతున్నాయని,

## రైల్వేలో 195ఉద్యోగాలు



రైల్వేలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు శుభవార్త. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్బీ) ఐసోలేటెడ్ కేటగిరీస్ రిక్రూట్‌మెంట్ 2026కు సంబంధించిన షా నోటిఫికేషన్‌ను అక్టోబర్ 21న విడుదల చేసింది. మొత్తం 195 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొంది.

2లో

## మైసూరు దసరా వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

2లో



చాముండేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రేవంత్

ప్రఖ్యాత జంబూ సవారీని ఇతర ప్రముఖులతో కలిసి వీక్షించిన సీఎం

కర్ణాటక 'నాడ హబ్బ'లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ, కేరళ ముఖ్యమంత్రులు హాజరుకావడం ఇదే ప్రథమం

కర్ణాటక రాష్ట్ర పండుగగా ప్రసిద్ధి చెందిన మైసూరు దసరా ఉత్సవాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రత్యేక ఆహ్వానం మేరకు బుధవారం జరిగిన విజయదశమి వేడుకల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'జంబూ సవారీ'ని ఇతర ప్రముఖులతో కలిసి తిలకించారు. ఉత్సవాల్లో పాల్గొనడానికి ముందు రేవంత్ రెడ్డి చాముండి కొండపై కొలువైన చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మైసూరు ప్యాలెస్ వెలుపల ఏర్పాటు చేసిన వేదికపై నుంచి దసరా వేడుకలను వీక్షించారు. 750 కిలోల బరువున్న బంగారు

## 'రప్పా రప్పా' అంటూ రౌడీయిజం చేస్తే సహించం..



2లో

ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో దేశానికే ఆదర్శంగా నిలవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాజకీయ ముసుగులో అరాచకాలు, రౌడీయిజం చేసేవారిని ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నేరస్తులకు పోలీసు యూనిఫాం చూస్తే భయం కలగాలని, అదే సమయంలో బాధితులకు పూర్తి భరోసా లభించాలని ఆయన ఆకాంక్షించారు. మంగళగిరిలోని 6వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో నేడు నిర్వహించిన 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర పోలీసులకు ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ఖాకీ అంటే బాధ్యత, పోలీసు అంటే భరోసా. ప్రమాదం జరిగినా, నేరం జరిగినా ప్రజలకు మొదటగా గుర్తొచ్చేది పోలీసులే.

## ఏపీలో 100 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్..

### సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎస్ఈసీ నిర్ణయం

నామినేషన్ల అడ్డగింతపై వైసీపీ వేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో విచారణ

ఫిర్యాదులు వచ్చిన చోట్ల వాటిని పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు

ఎన్నికల ప్రక్రియపై గురువారం తుది ఉత్తర్వులు జారీ చేయనున్న ఎస్ఈసీ

2లో



ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల (మున్సిపాలిటీ) ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తాత్కాలికంగా నిలిపివేసింది. రాష్ట్రంలోని మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి తదుపరి ఎన్నికల ప్రక్రియను తక్షణమే

## ఆయుధ పూజలో లేడీసింగం,,



- ఆయుధ పూజలో ఏకే47 ఫైరింగ్
- వీడియో వైరల్.. మాజీ సైనికాధికారుల అభ్యంతరం
- గాల్లోకి కాల్పులు జరపడం ప్రమాదకరమని హెచ్చరిక
- ఆయుధ పూజ అంటే పూజించడమే
- కాల్పులు జరపడం కాదని వ్యాఖ్యలు
- నిర్లక్ష్యంగా కాల్పులు జరిపితే రెండేళ్ల వరకు జైలు శిక్షకు అవకాశం

2లో

## తెలంగాణకు బీసీ సీఎం.. కానీ ఇప్పుడే కాదు

- బీసీ వ్యక్తి సీఎం కావడానికి డెడ్‌లైన్ ఏమీ లేదన్న మహేశ్ గౌడ్
- రేవంత్ రెడ్డి పాలన 2039 వరకు కొనసాగుతుందని విశ్వాసం
- కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణకు బీసీ సీఎం సాధ్యమని వ్యాఖ్య



తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉందని మహేశ్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాదని, 2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు.

2లో

## అమెరికా-పాక్ దోస్తీ.. భారత్‌కు అగ్రరాజ్యం కీలక హామీ!

భారత్‌తో బంధానికి నష్టం జరగదని అమెరికా విదేశాంగ మంత్రి రూబియో హామీ

వాణిజ్య ఒప్పందానికి అమెరికా కట్టుబడి ఉందని స్పష్టీకరణ

పాక్‌తో సంబంధాలు ఘర్షణల నివారణకు ఉపయోగపడతాయని వెల్లడి

భారత్‌ను ఆందోళనపరిచే చర్యలను పాక్ నిరుత్సాహపరిచేలా చూస్తామన్న రూబియో

భారత్‌తో సంబంధాలకు తమ ప్రాధాన్యం తగ్గదని స్పష్టీకరణ

2లో



అమెరికా, పాకిస్థాన్ మధ్య సాన్నిహిత్యం పెరుగుతున్న వేళ భారత్‌కు అగ్రరాజ్యం భరోసా ఇచ్చింది. ఇతర దేశాలతో తమ సంబంధాల వల్ల భారత్‌తో బంధానికి ఎలాంటి నష్టం జరగదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పష్టం చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం, పరస్పర



## పోలీసుల సంక్షేమానికి పెద్దపీట

### పోలీసు ఉద్యోగాలపై సీఎం కీలక ప్రకటన

- అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం
- పోలీసు శాఖలో 7,437 పోస్టుల భర్తీకి అనుమతి
- నేరగాళ్లతో ఫ్రెండ్లీగా ఉండొద్దు
- డ్రగ్స్ కట్టడిలో తెలంగాణ పోలీసులదే టాప్
- అమరవీరుల త్యాగాలు మరువలేం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మిగతా2లో

పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉన్నప్పుడే అభివృద్ధి వేగంగా సాగుతుందని పేర్కొన్నారు. సమాజ రక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను

## నిత్యవసరాల ధరలకు కళ్లెం వేయండి

దాని ప్రభావం రాష్ట్రంపై పడకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బియ్యం, కందిపప్పు, ఉల్లి, వంటనూనె, పంచదార వంటి నిత్యావసరాల ధరలు పెరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బియ్యం అమ్మకాలపై ఆయన ఆరా తీశారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని అధికారులు వివరించగా.. దీపావళి, సంక్రాంతి పండుగల సమయంలో కూడా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులో ఉంచే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. మార్కెట్‌లో ఉల్లిపాయల సరఫరాను మరింత పెంచి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఈ పథకం అమలులో జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్నామని, దీన్ని మరింత మెరుగుపరచాలన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలంటే మరో తొమ్మిది లక్షల కనెక్షన్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, దీని కోసం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. ఇసుక సరఫరాలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎం సూచించారు. పాలనలో టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాలని చంద్రబాబు అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో వైసీపీకి షాక్..

మంగళగిరి నియోజకవర్గంలో అధికార తెలుగుదేశం పార్టీలోకి చేరికల పర్వం కొనసాగుతోంది. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత, గుంటూరు పార్లమెంట్ వైసీపీ ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్ తన మద్దతుదారులతో కలిసి టీడీపీలో చేరారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు, మరో 25 కుటుంబాలకు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. “2024 సార్వత్రిక ఎన్నికల కంటే స్థానిక ఎన్నికల్లోనే ఎక్కువ మెజార్టీ సాధించాలి. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలి. ఎన్డీయే పక్షాన నిలబడటమే మనకు శ్రీరామరక్ష. అప్పుడే మనం అనుకున్న అభివృద్ధి సాధ్యమవుతుంది“ అని ఆయన స్పష్టం చేశారు.గత పదేళ్ల పాలనను, తన రెండున్నరేళ్ల పనితీరును బేరీజు వేసుకుని ప్రజలు ఓటు వేయాలని లోకేశ్ కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ, ఆసుపత్రి, కమ్యూనిటీ భవనాలు, పార్కులు వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అహర్నిశలు పనిచేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎంపీపీ అయిన రజనీకాంత్‌తో పాటు, చిలువూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ యాళ్ల జయలక్ష్మీ, ఇతర టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీలో 100 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్..

నిలిపివేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాల నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, నామినేషన్ల గడువును పొడిగించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం, ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని వాయిదా వేయడానికి నిరాకరించినప్పటికీ, నామినేషన్ల దాఖలులో అడ్డంకులు ఎదురైనట్లు ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో క్షుణ్ణంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించింది. ఈ అంశంపై గురువారం లోగా స్పష్టత ఇవ్వాలని సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఈ తాత్కాలిక నిలిపివేత నిర్ణయం తీసుకున్నారు. సంబంధిత ప్రాంతాల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. ఆ నివేదికలు అందిన అనంతరం వాటన్నింటినీ పరిశీలించి, గురువారం (అక్టోబరు 22) తుది ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

## రాష్ట్రంలో అల్లర్లకు జగనే కర్త, కర్మ, క్రియ: పీతల సుజాత




రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లకు, దౌర్జన్యాలకు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డే కర్త, కర్మ, క్రియ అని ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పీతల సుజాత ఆరోపించారు. జగన్ ఆదేశాల మేరకే వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. బెంగళూరులో ఉంటూ పొరుగు రాష్ట్రాల నుంచి గ్యాంగ్‌స్టర్లను తీసుకొచ్చి, రాష్ట్రంలో కూటమి నాయకులు, కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు.స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా జరుగుతుంటే, కేవలం రెండు ప్రాంతాల్లోనే గొడవలు సృష్టించి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని సుజాత ఆరోపించారు. “నామినేషన్ కేంద్రంలోకి ముగ్గురికే అనుమతి ఉంటే, వైసీపీ ఎంపీలు అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి వందల మందిని తీసుకొచ్చి పోలీసులపై దాడులకు పాల్పడుతున్నారు. బీర్ బాటిళ్లు, రాళ్లు, ఇనుప రాడ్లతో దాడులు చేస్తున్నారు. ఎంపీలుగా ఉన్న వీరికి ఎన్నికల నియమావళి తెలియదా?“ అని ఆమె ప్రశ్నించారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం దక్కడం ఇష్టం లేకే, వారు పోటీ చేస్తున్న చోట లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నికలు గంజాయి బ్యాచ్‌కు, గ్రాడ్యుయేషన్ బ్యాచ్‌కు మధ్య జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు.గతంలో వైసీపీ హయాంలో స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, వారి ఇళ్లలో గంజాయి, మద్యం పెట్టి అక్రమ కేసులు బనాయించారని సుజాత గుర్తుచేశారు. ఇప్పుడు ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతుంటే తట్టుకోలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల మనసులు గెలుచుకోవాలని, దౌర్జన్యాలతో కాదని హితవు పలికారు. ఇదే సమయంలో జగన్ కుటుంబ వ్యవహారాలపైనా పీతల సుజాత తీవ్ర విమర్శలు చేశారు. “కుటుంబ బంధాలపై గొడ్డలి వేసిన నీచ చరిత్ర జగన్‌ది. తండ్రి తర్వాత తండ్రి లాంటి మేనమామ, సొంత మేనకోడలు పెళ్లికి అడ్డుపడటం సిగ్గుచేటు. ఆస్తి కోసం సొంత చెల్లిని, తల్లిని దూరం పెట్టిన వ్యక్తి, ఇప్పుడు మేనకోడలి వివాహానికి స్థలం ఇవ్వకుండా మానవతా విలువలను మరిచారు“ అని ఆమె మండిపడ్డారు. జగన్ తీరు ఆయన పార్టీ సంస్కృతికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

# పోలీసుల సంక్షేమానికి పెద్దపీట

స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. 2028 నాటికి పోలీసు శాఖలోని అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు.

**అమరవీరులకు ఘన నివాళి** పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గోషామహల్‌లో నిర్వహించిన పోలీసు స్మారక పరేడ్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ ఏడాది 155 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ప్రజల భద్రత కోసం పోలీసులు చేస్తున్న సేవలు, త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితులు, కొత్త సవాళ్లకు అనుగుణంగా పోలీసు శాఖ ఎప్పటికప్పుడు తన విధానాలను మెరుగుపరుచుకుంటోందని ప్రశంసించారు.

**7,437 పోస్టుల భర్తీకి అనుమతి** పోలీసు శాఖను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగా 4,773 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు వెల్లడించారు. పోలీసు శాఖలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చామని, మిగిలిన ఖాళీలను కూడా దశలవారీగా భర్తీ చేస్తామని చెప్పారు. 2028 నాటికి శాఖలోని అన్ని ఖాళీలను భర్తీ చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. 112 మంది డీఎస్పీలను ప్రత్యక్ష నియామక పద్ధతిలో నియమించినట్లు వివరించారు.

**అమరవీరుల కుటుంబాలకు అండగా..** పోలీసు సిబ్బంది సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భవిష్యత్తుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు అందించే ఎక్స్‌గ్రేషియాను హోదాను బట్టి కోటి రూపాయలకు పైగా పెంచినట్లు తెలిపారు. దేశానికి, సమాజానికి సేవ చేసిన పోలీసు సిబ్బందిని గుర్తించడంతోపాటు వారి కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. పోలీసు ఉద్యోగుల పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రత్యేక పోలీసు పాఠశాలను ఏర్పాటు చేసినట్లు పునరుద్ఘాటించారు.

**డ్రగ్స్ కట్టడిలో పోలీసుల పనితీరు భేష్**

యువత మత్తు పదార్థాలకు బానిసలవడం ఆందోళనకరమని ముఖ్యమంత్రి అన్నారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు డ్రగ్స్ నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ విషయంలో తెలంగాణ పోలీసు శాఖ పనితీరు అభినందనీయమని కొనియాడారు. ఉత్తమ పనితీరులో రాష్ట్ర పోలీసు శాఖ జాతీయ స్థాయిలో తొలి స్థానం సాధించిందని పేర్కొన్నారు.

**ఆహార కల్తీపై ఉక్కుపాదం** ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఆహార కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. టీజీ సేఫ్ కార్యక్రమం ద్వారా కల్తీకి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో ట్రాన్స్‌జెండర్లకు బాధ్యతలు అప్పగించడం సాహసోపేత నిర్ణయమని పేర్కొన్నారు.

**నేరగాళ్ల పట్ల కఠినంగా ఉండాలి** ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే నేరగాళ్లతో స్నేహంగా ఉండటం కాదని సీఎం స్పష్టం చేశారు. బాధితులు, సామాన్యులు, అమాయకుల పట్ల పోలీసులు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అదే సమయంలో నేరగాళ్లు, భూకబ్జాదారులు, డ్రగ్స్ అక్రమ వ్యాపారుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు భరోసా కల్పిస్తూ, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.పోలీసు అమరవీరుల త్యాగాలను గౌరవిస్తూ, వారు ఆశించిన లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజలందరి భాగస్వామ్యంతో సురక్షితమైన, అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు.

# ఆయుధ పూజలో లేడీసింగం,,,

విధి నిర్వహణలో క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన పోలీసు అధికారులే ఆయుధాల వినియోగంలో జాగ్రత్తలు పాటించకపోతే ఎలా? ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అంకితా శర్మ ఏకే47 రైఫిల్‌తో కాల్పులు జరుపుతున్న వీడియో ఇప్పుడు ఈ ప్రశ్నను తెరపైకి తెచ్చింది. దసరా వేడుకల్లో భాగంగా నిర్వహించిన శస్త్ర పూజ సందర్భంగా ఆమె కాల్పులు జరిపిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో ఆయుధాల భద్రత, అధికారుల బాధ్యత, నిబంధనల అమలుపై మాజీ సైనికాధికారులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఎవరీ అంకితా శర్మ?** ఛత్తీస్‌గఢ్ పశ్చిమ ప్రాంతంలోని రాజ్‌నంద్‌గావ్ జిల్లా ఎస్పీగా అంకితా శర్మ విధులు నిర్వర్తిస్తున్నారు. దసరా సందర్భంగా రాజ్‌నంద్‌గావ్ పోలీసు లైన్స్‌లో నిర్వహించిన శస్త్ర పూజ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉన్నతాధికారులు పాల్గొన్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఆమె ఏకే47 రైఫిల్‌తో కాల్పులు జరిపిన వీడియో బయటకు వచ్చింది. ఆ వీడియోను అంకితా శర్మ స్వయంగా తన ఖాతాల్లో పోస్ట్ చేయనప్పటికీ, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వేదికలపై లక్షలాది మంది వీక్షించారు. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు 9.17 లక్షల మంది, ఎక్స్‌లో 2.76 లక్షలకు పైగా అనుచరులు ఉన్నారు. అయితే, ఈ వీడియో కేవలం సామాజిక మాధ్యమాల్లో చర్చకే పరిమితం కాలేదు. ఆయుధాల వినియోగంలో పాటించాల్సిన కనీస భద్రతా ప్రమాణాలు అమలయ్యాయా? గాల్లోకి కాల్పులు జరపాల్సిన అవసరం ఏమొచ్చింది? అంటూ మాజీ సైనికాధికారులు ప్రశ్నిస్తున్నారు.

**సందర్భం సరికాదు’** రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ సుశీల్ సింగ్ షియోరన్ ఈ ఘటనపై స్పందిస్తూ.. అంకితా శర్మకు ఆయుధంపై పరిచయం ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, కాల్పులు జరిపిన సందర్భం మాత్రం సముచితం కాదని అభిప్రాయపడ్డారు.వేడుకల సమయంలో గాల్లోకి కాల్పులు జరపడం మందుగుండు సామగ్రి వృథా చేయడమే కాకుండా భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించే చర్యగా మారవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వాహకులను బాధ్యులుగా చేయాలని సూచించారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదం జరగలేదని వ్యాఖ్యానించారు.ఆయుధాన్ని నిర్వహించడంలో నైపుణ్యం ఉన్నంత మాత్రాన సరిపోదని, దాన్ని ఎప్పుడు, ఎక్కడ వినియోగించాలన్న విచక్షణ కూడా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

**ఆయుధ పూజ అంటే కాల్పులు కాదు!** రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ సందీప్ అహ్లావత్ కూడా ఎక్స్ వేదికగా ఈ అంశంపై స్పందించారు. అంకితా శర్మ పేరును ప్రస్తావించకుండానే.. యుద్ధరంగంలో ఆయుధాలను వినియోగించే వారు వేడుకలు, వివాహ కార్యక్రమాల్లో ప్రదర్శన కోసం కాల్పులు జరపరని వ్యాఖ్యానించారు. శస్త్ర పూజ అంటే ఆయుధాలను గౌరవించడం, వాటిని పూజించడం మాత్రమేనని.. ప్రదర్శన కోసం కాల్పులు జరపడం కాదని స్పష్టం చేశారు. విధి కోరినప్పుడు మాత్రమే ఆయుధాలను వినియోగించాలని, అదే సమయంలో తాము ఉపయోగించే ఆయుధాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.విజయదశమి సందర్భంగా సాయుధ బలగాలు, పోలీసులు ఆయుధాలు, ఇతర పరికరాలకు పూజలు చేయడం ఆనవాయితీ. విధి నిర్వహణకు అవసరమైన సన్నద్ధత, బాధ్యతకు ప్రతీకగా ఈ సంప్రదాయాన్ని పాటిస్తారు. అయితే, ఈ ఆచారంలో భాగంగా తప్పనిసరిగా కాల్పులు జరపాలనే నిబంధన లేదని మాజీ సైనికాధికారులు గుర్తుచేస్తున్నారు.

**గాల్లోకి కాల్పులు జరిపితే ఎంత ప్రమాదం?** ఏకే47 రైఫిల్ నుంచి వెలువడే బుల్లెట్ అత్యంత వేగంతో ప్రయాణిస్తుంది. సాధారణంగా ఈ ఆయుధంలో 7.62ఐ39 మి.మీ. మందుగుండు సామగ్రిని ఉపయోగిస్తారు. అమెరికా సైనిక పరిశోధనా ప్రయోగశాల సాంకేతిక నివేదిక ప్రకారం, బుల్లెట్ తుపాకీ గొట్టం నుంచి బయటకు వచ్చే వేగం సెకనుకు సుమారు 715 మీటర్లు. గాల్లోకి కోణంలో కాల్పులు జరిపినప్పుడు బుల్లెట్ ప్రయాణ దిశ, వేగంపై గురుత్వాకర్షణ, గాలి నిరోధం ప్రభావం చూపుతాయి. అది కొంత దూరం ప్రయాణించి తిరిగి నేలపై పడవచ్చు. అలా పడే బుల్లెట్ కూడా పరిస్థితులను బట్టి తీవ్ర గాయాలకు, ప్రాణనష్టానికి కారణమయ్యే ప్రమాదం ఉంది.అమెరికాలో వేడుకల సందర్భంగా జరిపిన కాల్పుల్లో గాల్లోకి వెళ్లిన బుల్లెట్లు తిరిగి పడి ప్రాణాంతక గాయాలకు కారణమైన ఘటనలను 2013లో ప్రచురితమైన ఫోరెన్సిక్ అధ్యయనం కూడా నమోదు చేసింది కాల్పులు జరిగిన ప్రాంతంలో వెంటనే ప్రమాదం జరగలేదని చెప్పి, ఆ చర్యను సురక్షితమైనదిగా భావించలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బుల్లెట్ ఎక్కడ పడుతుందో కాల్పులు జరిపిన వ్యక్తి నియంత్రించలేని పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే తుపాకీ గొట్టం దిశపై నియంత్రణతోపాటు, తగిన భద్రతా ఏర్పాట్లు ఉన్న ప్రదేశాల్లోనే మందుగుండు వినియోగించాలని ఆయుధ భద్రతా నియమాలు చెబుతున్నాయి.

**చట్టం ఏం చెబుతోంది?** భారత ఆయుధ చట్టం1959లో నిర్లక్ష్యంగా లేదా ప్రమాదకరంగా తుపాకీని వినియోగించడం, ఇతరుల ప్రాణాలకు లేదా వ్యక్తిగత భద్రతకు ముప్పు కలిగించే వేడుకల కాల్పులకు సంబంధించి నిబంధనలు ఉన్నాయి.2019లో చేసిన సవరణ ద్వారా చేర్చిన సెక్షన్ 25(9) ప్రకారం, చట్ట పరిధిలోకి వచ్చే ఇటువంటి చర్యలకు రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.లక్ష వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది. బహిరంగ సభలు, మతపరమైన ప్రదేశాలు, వివాహ వేడుకలు, ఇతర కార్యక్రమాల్లో తుపాకీతో కాల్పులు జరిపి ప్రాణాలకు లేదా వ్యక్తిగత భద్రతకు ప్రమాదం కలిగించే సందర్భాలను ఈ నిబంధన పరిగణనలోకి తీసుకుంటుంది.వైరల్ వీడియో ఆధారంగానే అంకితా శర్మ నిర్దిష్ట నేరానికి పాల్పడ్డారని తేల్చడం తొందరపాటు అవుతుంది. ఈ ఘటన పోలీసు అధికారిక కార్యక్రమంలో జరిగినట్లు కనిపిస్తున్న నేపథ్యంలో, కాల్పులకు అనుమతి ఉందా? ఏ పరిస్థితుల్లో జరిగాయి? సంబంధిత సేవా నియమాలు ఏమంటున్నాయి? వంటి అంశాలపై పూర్తి వివరాలు అవసరం. చట్టపరమైన నిర్ణయానికి ముందు వీటిని పరిశీలించాల్సి ఉంటుంది. సాధారణ పౌరులు వ్యక్తిగత ఆయుధ లైసెన్స్ కింద తుపాకులు కలిగి ఉండటానికి, అధికారిక విధుల్లో భాగంగా సేవా ఆయుధాలను వినియోగించడానికి మధ్య తేడా కూడా ఉంది. ఆయుధ లైసెన్స్ ఉన్నంత మాత్రాన వేడుకల కోసం లేదా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు రూపొందించేందుకు ఇష్టానుసారంగా కాల్పులు జరిపే హక్కు లభించదు.

**‘ఐఏఎస్, ఐపీఎస్‌లు దేవుళ్లా?’.. సోషల్ మీడియాలో చర్చ**

ఈ ఘటనతో ప్రభుత్వ ఉన్నతాధికారుల ప్రవర్తన, వారిపై జవాబుదారీతనం ఎంతవరకు అమలవుతున్నాయన్న అంశంపై సామాజిక మాధ్యమాల్లో మరోసారి చర్చ మొదలైంది. ఐఏఎస్, ఐపీఎస్, జిల్లా స్థాయి అధికారుల తప్పులను ప్రశ్నించడమే కష్టమన్న అర్థంలో ఓ ఎక్స్ వినియోగదారు వ్యంగ్యంగా స్పందించారు. అధికారులను అత్యంత తెలివైనవారు, నిజాయతీపరులు, కష్టపడి పనిచేసేవారిగా భావించే ధోరణిపై విమర్శలు గుప్పించారు. విధి నిర్వహణ సమయంలోనే సామాజిక మాధ్యమాల కోసం వీడియోలు, రీల్స్ రూపొందిస్తూ అధికారాన్ని ప్రదర్శిస్తున్నారంటూ మరికొందరు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ‘ఐఏఎస్, ఐపీఎస్‌లు దేవుళ్లా?’ అంటూ మరో వినియోగదారు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అధికార వ్యవస్థలో వలస పాలన కాలం నాటి ఆధిపత్య ధోరణి ఇంకా కొనసాగుతోందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే, ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమైన అభిప్రాయాలే. అంకితా శర్మపై చట్టపరమైన లేదా శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు ఈ కథనానికి అందిన సమాచారం వెల్లడించడం లేదు. యూనిఫాం ధరించినవారికి ఆయుధాల వినియోగంలో నైపుణ్యం ఎంత అవసరమో, వాటిని బాధ్యతాయుతంగా ఉపయోగించే విచక్షణ కూడా అంతే ముఖ్యం. శస్త్ర పూజ సంప్రదాయాన్ని పాటించే క్రమంలో భద్రతా ప్రమాణాలు విస్మరించకూడదన్నదే ఈ ఘటనపై వెల్లువెత్తుతున్న విమర్శల సారాంశం. అధికారంలో ఉన్నవారు నిబంధనలు అతిక్రమించారని ఆరోపణలు వచ్చినప్పుడు, వాటిపై పారదర్శకంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవడమే జవాబుదారీతనానికి అసలైన పరీక్ష.

# ‘రప్పా రప్పా‘ అంటూ రౌడీయిజం చేస్తే సహించం..

ప్రజలు పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడానికి పోలీసులు తమ కుటుంబ సంతోషాలను త్యాగం చేస్తున్నారు“ అని అన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్, వీఐపీల పర్యటనలు ప్రశాంతంగా ముగియడం వెనుక పోలీసుల నిరంతర శ్రమ అభినందనీయమని కొనియాడారు. 1959లో లడఖ్‌లో చైనా సైనికులతో పోరాడుతూ పది మంది పోలీసులు ప్రాణాలర్పించారని, వారి త్యాగాలకు గుర్తుగా ఏటా ఈ దినాన్ని జరుపుకుంటున్నామని గుర్తుచేశారు.

**శాంతిభద్రతలతోనే అభివృద్ధి, పెట్టుబడులు** రాష్ట్రంలో శాంతిభద్రతలు, అభివృద్ధి, ప్రజల సంతోషం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని చంద్రబాబు విశ్లేషించారు. “భద్రత, భరోసా ఉన్న చోటకే పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయి. తద్వారానే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అందుకే తాను అధికారంలో ఉన్న ప్రతిసారీ శాంతిభద్రతలకే అత్యంత ప్రాధాన్యత ఇస్తాను“ అని పునరుద్ఘాటించారు. గతంలో ఫ్యాక్షన్‌ను నియంత్రించడం, నక్సలిజాన్ని ఎదుర్కోవడం, మత ఘర్షణలను అరికట్టడంలో ఏపీ పోలీసులు చూపిన ధైర్యసాహసాలు అసాధారణమైనవని ప్రశంసించారు. ఇటీవల దేశ భద్రతకు సంబంధించిన కుట్రలను ఛేదించిన కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**ఆధునిక నేరాలకు టెక్నాలజీతో చెక** మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం కూడా మారుతోందని, పోలీసు శాఖ దర్యాప్తు పద్ధతుల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. “ఒకే ఒక్క ఫోన్ కాల్, ఒక లింక్‌తో కష్టపడి సంపాదించుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారు. చదువుకున్నవారు సైతం మోసపోతున్నారు. ఇలాంటి నేరాలు జరగకుండా నివారించడమే ఉత్తమ పోలీసింగ్“ అని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి వాటిని పూర్తిస్థాయిలో వినియోగించి దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచుకోవాలని కోరారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణలో ‘ఈగల్‘ బృందం చేస్తున్న కృషిని అభినందించారు. మహిళలపై నేరాలకు పాల్పడాలంటేనే భయపడే వాతావరణం కల్పించాలని ఆదేశించారు.

**అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం** పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తీవ్రమైన ఒత్తిడితో పనిచేసే పోలీసులు యోగా, ధ్యానం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. అమరుల త్యాగాలకు అసలైన నివాళి అర్పించాలంటే ప్రజలకు నిరంతర భద్రత కల్పించడమే మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు అమర జవాన్ స్మృతిచిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళు లర్పించారు. అనంతరం ‘షహీద్ పుస్తక్ టోలీ‘, ‘అమరులు వారు‘ పుస్తకాలను ఆవిష్కరించారు. పోలీసు శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, ఫోరెన్సిక్, విపత్తు నిర్వహణ, ఆక్టోపస్ విభాగాల ఆధునిక ఆయుధాల గురించి అడిగి తెలుసుకున్నారు.

## క్రికెట్ లవర్స్‌కు కిక్కిచ్చే న్యూస్!

అసోసియేట్ దేశాలకు చెందిన ఆరుగురు ఆటగాళ్లకూ వేలంలో అవకాశం లభించనుంది. తక్కువ స్లాట్లు.. ఎక్కువ మంది ఆటగాళ్లు ఉండటంతో ఫ్రాంఛైజీల వ్యూహాలు కీలకం కానున్నాయి. ఏ జట్టు ఎవరిని ఎంచుకుంటుంది? యువ ఆటగాళ్లలో ఎవరికి అవకాశం దక్కుతుంది? అనేది ఆసక్తికరంగా మారనుంది.

**డిసెంబరు 16న ఐపీఎల్ మినీ వేలం..** ఇక 2027 సీజన్‌కు సంబంధించిన మెన్స్ ఐపీఎల్ మినీ వేలం డిసెంబరు 16న గోవాలోని ఐటీసీ గ్రాండ్ వేదికగా జరగనుంది. వేలానికి ముందు రోజు, అంటే డిసెంబరు 15న ఫ్రాంఛైజీలకు బ్రీఫింగ్ సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. అయితే ఈ వివరాలపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటనను పరిశీలించడం అవసరం. ఫ్రాంఛైజీలు తమ వద్ద ఉన్న ఆటగాళ్లలో ఎవరిని కొనసాగిస్తాయి? ఎవరిని విడుదల చేస్తాయి? వేలంలో ఏ స్థానాల కోసం పోటీపడతాయి? అనే అంశాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొననుంది. జట్లకు అవసరమైన ఆటగాళ్లను తక్కువ ధరకు దక్కించుకోవడం నుంచి కీలక ఆటగాళ్ల కోసం భారీ మొత్తాలు వెచ్చించడం వరకు వేలంలో అనేక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా అభిమానులను ఆకట్టుకునే ఈ లీగ్‌లో యువ ఆటగాళ్లకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించనుంది. అంతర్జాతీయ క్రికెటర్లకు కూడా ఫామ్‌ను మెరుగుపరుచుకునేందుకు, కొత్త వ్యూహాలను పరీక్షించుకునేందుకు ఐపీఎల్ వేదిక కానుంది.

**జనవరి 21 నుంచి బోర్డర్‌గావస్కర్ సమరం** భారత్‌ఆస్ట్రేలియా మధ్య జరిగే బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ టెస్టు క్రికెట్‌లో కీలక పోరుగా నిలవనుంది. 2027 జనవరి 21 నుంచి మార్చి 3 వరకు ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ భారత్‌కు స్వదేశంలో ఆడే అవకాశం కల్పించడంతో పాటు, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరాలన్న లక్ష్యంతోనూ కీలకం కానుంది. ఆస్ట్రేలియాకూ పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మెరుగుపరుచుకునేందుకు ఈ సిరీస్ ముఖ్యమే. దీంతో ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగే అవకాశం ఉంది.షెడ్యూల్ ప్రకారం తొలి టెస్టు జనవరి 21 నుంచి 25 వరకు నాగ్‌పూర్‌లో జరగనుంది. రెండో టెస్టు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు చెన్నైలో, మూడో టెస్టు ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు గువాహటిలో నిర్వహించనున్నారు. నాలుగో టెస్టు ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు రాంచీలో, ఐదో టెస్టు ఫిబ్రవరి 27 నుంచి మార్చి 3 వరకు అహ్మదాబాద్‌లో జరగనుంది. ఈ సిరీస్‌లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఎవరు పైచేయి సాధిస్తారన్నది ఆసక్తికరంగా మారనుంది.

**జూన్ 9 నుంచి డబ్ల్యూటీసీ ఫైనల్** టెస్టు క్రికెట్‌లో ప్రపంచ ఛాంపియన్ ఎవరో తేల్చే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ 2027 జూన్ 9 నుంచి 13 వరకు లండన్‌లోని ఓవల్ మైదానంలో జరగనుంది. ప్రస్తుత 20252027 డబ్ల్యూటీసీ సైకిల్‌లో లీగ్ దశ ముగిసిన తర్వాత పాయింట్ల పట్టికలో అగ్రస్థానాల్లో నిలిచే రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.భారత్ కూడా ఫైనల్ బెర్తు కోసం పోటీపడుతోంది. అయితే మిగిలిన మ్యాచ్‌ల ఫలితాలు, విజయాలు, డ్రాలు, పాయింట్ల శాతం ఆధారంగా అర్హత మారనుంది. అందువల్ల బోర్డర్‌గావస్కర్ ట్రోఫీతో పాటు ఇతర టెస్టు సిరీస్‌ల ఫలితాలూ భారత్ అవకాశాలపై ప్రభావం చూపనున్నాయి. స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే ఐదు టెస్టుల్లో మెరుగైన ఫలితాలు సాధించడం టీమిండియాకు కీలకం కానుంది. ఓవల్‌లో జరిగే ఫైనల్‌లో అర్హత సాధించిన రెండు జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ఐదు రోజుల పాటు సాగే ఈ పోరులో బ్యాటర్ల ఓర్పు, బౌలర్ల నిలకడ, కెప్టెన్ల వ్యూహాలు కీలకం కానున్నాయి. భారత్ ఫైనల్‌కు చేరితే మరోసారి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ టైటిల్ కోసం పోటీపడే అవకాశం లభిస్తుంది.

నంది పత్రిక

22 గురువారం అక్టోర్‌బర్ 2026

# పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించకుండా అవమానించారు

## బీజేపీ నాయకత్వంపై బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సిలివేరి వెంకటేష్ అసంతృప్తి



**డోన్ నంది పత్రిక, అక్టోబర్ 21:** భారతీయ జనతా యువమోర్చా నంద్యాల జిల్లా అధ్యక్షుడు సిలివేరి వెంకటేష్‌కు పార్టీ కార్యక్రమాల్లో తగిన ప్రాధాన్యత కల్పించకపోవడంపై అసంతృప్తి వ్యక్తమైంది. ఈ మేరకు ఆయన 2026 అక్టోబర్ 21వ తేదీన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి లేఖ రాశారు. నంద్యాల జిల్లా కోశాధికారి కమలేష్ రాజపుత్ర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలకు తనను ఆహ్వానించకుండా పక్కన పెట్టారని సిలివేరి వెంకటేష్ తన లేఖలో పేర్కొన్నారు. భారతీయ జనతా యువమోర్చా నంద్యాల జిల్లా కోశాధికారిగా ఉన్న కమలేష్ రాజపుత్ర తన పార్టీ ఆదేశాలను పాటించకుండా, పార్టీ వ్యవహారాల్లో తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు.పార్టీ కార్యక్రమాలు నిర్వహించే సమయంలో సంబంధిత నాయకులకు సమాచారం అందించడం, వారిని ఆహ్వానించడం వంటి కనీస బాధ్యతలను విస్మరించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీకి సంబంధించిన కార్యక్రమాల్లో తనను భాగస్వామ్యం చేయకుండా పక్కన పెట్టడం, తనకు ఎలాంటి సంబంధం లేనట్లుగా వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు.ఈ విషయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. దయాకర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. హరికృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ నాయకత్వం ఈ వ్యవహారంపై స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు లేఖ ద్వారా తెలుస్తోంది. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్న నాయకులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందని ఈ పరిణామం చర్చకు దారితీసింది.

# కర్నూలు అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించండి: మంత్రి టీజీ భరత్



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కోసం కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కర్నూలు నగరంలోని 4, 5వ వార్డుల్లో కూటమి మేయర్ అభ్యర్థి బొల్లెద్దుల విజయ ప్రత్యూషతో కలిసి మంత్రి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు.ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల నుంచి వైసీపీకి మేయర్ అభ్యర్థి దొరకలేదా? అని ప్రశ్నించారు. వైసీపీ కార్పొరేటర్లు గెలిచినా చేసేదేమీ లేదని విమర్శించారు. అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీకి తెలుసని, ప్రజలకు మేలు చేయడం తెలియదని అన్నారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, నగర ప్రగతికి అడ్డంకులు లేకుండా ముందుకు సాగాలంటే కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. కర్నూలు నగరంలో రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా నగర అభివృద్ధికి మరిన్ని అవకాశాలు కల్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో కర్నూలును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ప్రచారంలో 4వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సుశీల భాయి, 5వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి ఉట్ల రమేష్ బాబు పాల్గొన్నారు.

# ఓటరు స్లిప్పుల పంపిణీ వేగంగా పూర్తి చేయాలి

## ఈ నెల 26వ తేదీలోపు ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలి

## ఓటర్లకు స్లిప్పులు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదు

## చరవాణి ద్వారా వార్డు, పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకునే సౌలభ్యం

## అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 28న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, ఈ నెల 26వ తేదీలోపు పూర్తి చేయాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి, ఓటరు స్లిప్పుల ప్రతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో ఓటరు స్లిప్పుల పంపిణీ కీలకమైనదని, ప్రతి ఓటరుకు స్లిప్పు అందేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. స్లిప్పు ఇచ్చాక రశీదుపై కుటుంబంలో ఒకరి నుంచి సంతకం తీసుకోవాలని సూచించారు. ఓటర్లు తమ వార్డు, పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకోవాలంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ హెచ్ టీ టీ పి యస్ ://యస్ ఈ సి –ఈ యం యస్ .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ ద్వారా వివరాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు.ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సమాచారాన్ని అందిస్తూ, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు.

# నూతన ఇటుకల మిషన్ ను ప్రారంభించిన మాజీ మంత్రి బుగ్గన.

**బేతంచెర్ల అక్టోబర్ 21 ( నంది పత్రిక ).** బేతంచెర్లపట్టణం శివారులోని కొలుములపల్లె రస్తాలో నూతనంగా నిర్మించిన ఇటుకల బట్టి మిషన్ ను బుధవారం నాడు రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు.బలపాలపల్లె గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త అయ్య స్వాములు ఇటుకల బట్టి మిషన్ ను నూతనంగా నిర్మించు కున్నారు. ఇటుక బట్టి ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర్ రెడ్డి, చిన్న ఎద్దులన్న, నాగేశ్వరరావు, పీఏ తిమ్మయ్య, పాల్గొన్నారు



# పుట్టపర్తిలో మున్సిపల్ ఎన్నికల సందడి

## 28 వార్డుల అభ్యర్థులకు బీ-ఫారాల పంపిణీ

## ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** పుట్టపర్తిలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మున్సిపల్ చైర్మన్ కూటమి పార్టీ జనసేన అభ్యర్థి మేకల ఈశ్వర్ మరియు 28 వార్డుల టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థులకు బీ–ఫారాలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి , మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అందజేశారు ఈ కార్యక్రమంలో.. పుట్టపర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మరియు కూడా చైర్మన్ సోమిసెట్టి వెంకటేశ్వర్లు c పుట్టపర్తి నియోజకవర్గ పరిశీలకులు, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ హయాంలో పుట్టపర్తి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, ప్రతి వార్డు అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కేఎంసిలో ఇంటర్నేషనల్ రోడ్డు పనులకు శ్రీకారం

## అడిషనల్ డీఎంఈ & మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కెఎంసిలో ఇంటర్నల్ రోడ్స్ పనులకు శ్రీకారం.... కర్నూల్ మెడికల్ కాలేజీలో అంతర్గత బిటి రోడ్ల నిర్మాణ పనులు రు. 12 లక్షల రూపాయలతో చేపట్టామని అడిషనల్ డీఎంఈ & మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలంలో ఏర్పడిన గుంతలు ఇబ్బందికరంగా ఉండటంతో రోడ్డు పనులు చేపట్టడానికి 6 నెలల క్రితమే ఉన్నతాధికారుల అనుమతి కోరడం జరిగింది అని వారు సూచన మేరకు ఏపీ ఎంఎస్ఐడీసీ వారిని కోరడం జరిగింది అని ప్రస్తుతం వారి ద్వారానే బిటి రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా అనాటమీ ఫిజియాలజీ మైక్రోబయాలజీ డిపార్ట్మెంట్ లకు 150 నూతన మైక్రోస్కోప్ లు అందజేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

# 51 వ వార్డులో వైసీపీ అభ్యర్థి గిరిప్రసాద్ కు మద్దతుగా ప్రచారం చేసిన వైసీపీ నాయకులు యాపదిన్నె మద్దిలేటి



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్ఆర్సిపి మేయర్ అభ్యర్థి సుశీల, 51వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి గిరి ప్రసాద్ కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే మణి గాంధీ , 40 వార్డ్ మాజీ కార్పొరేటర్ విక్రమసింహా రెడ్డి , వై.మద్దిలేటి ,51వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి గిరి ప్రసాద్ , 51 వ వార్డు పరిధిలోని ఎల్ పేట, బటర్ఫ్లై హోమ్స్ లో ఈరోజు ప్రచార కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎల్ పేట గ్రామ వైస్సార్సీపీ పెద్దలు బి .పరమేష్, ఎం .దస్తగిరి, శివరాముడు ఏన్ .కృష్ణ, గీతా ముఖర్జీ నగర్ వైఎస్ఆర్సీపీ నాయకులు రాము శేషన్న రవి మహేంద్ర గౌడ్ సద్దాం బాలాజీ నగర్ మహేష్ శ్రీధర్ గణేష్ కర్నూల్ జిల్లా సోషల్ మీడియా జనరల్ సెక్రెటరీ బి .మధుసూదన్ పాల్గొన్నారు

# 48,49 వార్డులలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ యువనాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ కమ్మరి పార్వతమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** పాణ్యం నియోజకవర్గ శాసనసభ్యురాలు, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితా రెడ్డి ఆదేశాల మేరకు, యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ ఆధ్వర్యంలో ఈరోజు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 48వ వార్డు ఎన్టీఆర్ నగర్ వీకర్ సెక్షన్ కాలనీ, మేదరి కాలనీ, మారుతినగర్ ఏరియా మరియు 49వ వార్డు సెంటర్ శివాలయం వీధి, సింగిల్ ట్యాంక్ ఏరియాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. ప్రతి ఇంటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ తెలుగుదేశం పార్టీ కర్నూలు మేయర్ అభ్యర్థి బొల్లెద్దుల విజయ ప్రత్యూష ని, 48వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సుతారు రాఘవేంద్ర ని మరియు 49వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి బి. శివపార్వతి ని సైకిల్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించవలసిందిగా అభ్యర్థించాము. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు శివ, క్లస్టర్ ఇన్‌చార్జ్ జనార్ధన్ ఆచారి, క్లస్టర్ కో–కన్వీనర్ కాసాని మహేష్ గౌడ్, 48వ వార్డు ఇన్‌చార్జ్ నాగేశ్వర రావు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బేతంచెర్ల పట్టణంలో పర్యటించిన మాజీ మంత్రి బుగ్గన.



**బేతంచెర్ల అక్టోబర్ 21 ( నంది పత్రిక ).** బేతంచెర్ల పట్టణంలోరాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పట్టణంలోని వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలతో పాటు ఆర్యవైశ్యుల,ముస్లిం మైనార్టీ నాయకులు,బలిజ సంఘం నాయకుల నివాసిత గృహాల వద్దకు వెళ్లి ఆ ప్రాంత నాయకులను కలిసి వారి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు వారు మాజీ మంత్రి బుగ్గనకు శాలువాలు వేసి పూల దండలతో సత్కరించారు. అలాగే ప్రస్తుతం జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చించారు.మరియు బైటిపేట కాలనీలో దసరా శరన్నవ రాత్రుల కార్యక్రమాల సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు కాలనీకి వెళ్లి,ఆయన శ్రీ ఆంజనేయ స్వామికి, శ్రీవాసవీ కన్య కాపరమేశ్వరి దేవ స్థానం (అమ్మవారిశాల ) లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ ముర్తు జావలి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఖాజా హుస్సేన్,శ్రీ మద్దిలేటి స్వామి దేవ స్థానం ధర్మ కర్తల మండలి మాజీ చైర్మన్ సిహెచ్ లక్ష్మిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ చంద్రుడు, సొసైటీ మాజీ డైరెక్టర్ రుద్రవరం నారాయణ,టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్, వైసీపీ నాయకులు పిక్కిలి మనోహర్ నాయుడు,కాజా, శాలిబేగ్, గని, దాసరి, వెంకటేశ్వర్లు, దాసరి రవి, దాసరి మద్దిలేటి, కమల్, బాలీశ్వరయ్య, హుస్సేన్ రెడ్డి, శశి రెడ్డి, జస్వంత్ రెడ్డి, హసన్, అడపాల తిరుమలేష్ మరియు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# నాని మృతితో విషాద ఛాయలు





**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 21:** పిడికెడు అన్నం పెడితే చాలు! జీవితాంతం అన్నం పెట్టిన వ్యక్తిపై విశ్వాసం చూపుతుంది. అందుకే కుక్కను విశ్వాసానికి మారుపేరుగా పోలుస్తారు. అన్నం పెట్టిన వ్యక్తి పట్ల ప్రేమ చూపుతుంది. చచ్చేవరకు కృతజ్ఞతా భావన కనపరుస్తుంది. నిన్ను నమ్మే కంటే కుక్కను నమ్ముకుంటే చాలా ఉపయోగం ఉంటుంది అని చాలామంది అనడం వింటూ ఉంటాం. పార్టీ కోసం వాడు కుక్కలా చాకిరి చేస్తున్నాడు రా అని చాలామంది చాకిరిని కుక్కలతో పోలుస్తూ ఉంటారు. మనుషుల పట్ల నమ్మకాలు కోల్పోతున్న నేటి పరిస్థితుల్లో చాలామంది ఒంటరి జీవితం గడుపుతున్న వ్యక్తులు తోడు కోసం కుక్కలను పెంచుకున్న పెంచుకుంటున్నారు అని చెప్పడంలో ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. అలాంటి కుక్కలకు అనారోగ్యం పాలైతే భరించడం చాలా కష్టం. విశ్వాసం చూపుతున్న ఆ కుక్క పరిస్థితి కుటుంబం మొత్తం విలవిలలాడిపోయే పరిస్థితులు ఏర్పడతాయి. దాదాపు మూడు సంవత్సరాల పాటు ఓ కుటుంబంలో సభ్యుడిగా మెలిగిన ఓ శనకం హఠాత్తుగా అనారోగ్యానికి గురి అయి చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్న సంఘటన బండి ఆత్మకూరులో జరిగింది. స్థానికుడైన గంగన్న (గౌతమి సప్లయర్స్) మూడు సంవత్సరాల క్రితం బండి ఆత్మకూరులో ని చర్చి వద్ద ఓ చిన్న కుక్క పిల్లను ఇంటికి తెచ్చుకున్నాడు. కుక్కపిల్లకు నాని అని నామకరణం చేశారు.కుటుంబ సభ్యుల పోషణతో, వారి పట్ల విశ్వాసం చూపుతూ, కుటుంబంలో ఒకరిగా మెలుగుతూ వచ్చింది. నెలరోజుల క్రితం హఠాత్తుగా నానికి జబ్బు చేసింది. వణుకుడు వ్యాధికి గురి అయ్యి మంచాన పడింది. దీంతో యజమాని గంగన్న దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయాడు. నానికి వైద్యం చేయించేందుకు నంద్యాల ప్రొద్దుటూరు పశువైద్య కేంద్రాలకు తీసుకొని వెళ్లి చికిత్స చేసే ప్రయత్నం చేశాడు. అయితే ఈ వణుకుడు వ్యాధికి ఎలాంటి చికిత్స లేదని వైద్యుడు చెప్పడంతో యజమాని ఆందోళన చెందారు. అయినప్పటికీ కుక్కను ఇంటికి తెచ్చి ఇంట్లోనే వైద్యం చేస్తూ, ఆహార పానీయాలు అందజేయడంలో శ్రద్ధ వహించారు. నాని ఆరోగ్యం క్షీణించిపోయి బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ కారణంగా కుటుంబ సభ్యులు నాని మృతిని తలుచుకుంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. సాంప్రదాయ బద్ధంగా నానికి బుధవారం ఖనన సంస్కారాలు చేశారు. మనుషుల పట్ల నమ్మకాలు కోల్పోతున్న నేటి రోజుల్లో, కుక్క పట్ల విశ్వాసం చూపి, దాని మృతికి చింతిస్తూ, సాంప్రదాయ బద్ధంగా ఖనన సంస్కారాలు చేయించడం అభినందనీయం.

# 1వ వార్డులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలోని 1వ వార్డులో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కర్నూలు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ స్టేట్ మైనారిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఏ. హాఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థి పింజారి జిలేఖ బీ కి, కర్నూలు నగర మేయర్ అభ్యర్థి యు. సుశీల కి ఫ్యాన్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో 1వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల స్థూపానికి ఘనంగా నివాళులు అర్పించిన

# కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్





**విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం.**

**అమర వీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం.**

**దేశ, రాష్ట్ర శాంతి భద్రతల పరిరక్షణలో (01.09.2025 నుండి 31.08.2026) ప్రాణ త్యాగాలు చేసి అమరులైన 154 మంది పోలీసులకు ఘన నివాళి.**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం మన భాధ్యత , వారు చేసిన త్యాగాలు, సేవలు మరువలేనివని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సంధర్భంగా బుధవారం స్ధానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పెరేడ్ నిర్వహించారు.కర్నూలు ఎస్పీ స్మృతి పరేడ్ కు హాజరై, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ...1959 అక్టోబర్ 21న లద్దాఖ్‌లోని ఆక్సాయ్ చిన్ హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా బలగాలతో వీరోచితంగా పోరాడి 10 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారని, వారి త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు.దేశవ్యాప్తంగానే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో , కర్నూలు జిల్లా పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతాల్లో నక్సలిజం, తీవ్రవాద వ్యతిరేక పోరాటాల్లో పలువురు పోలీసులు ప్రాణాలను త్యాగం చేశారన్నారు.పోలీసు శాఖ ఎల్లవేళలా అమరుల కుటుంబాలకు అండగా నిలుస్తుందన్నారు. దసరా , దీపావళి వంటి పండుగలు , విశేష దినాల్లో కూడా కుటుంబాలకు దూరంగా ఉంటూ, అహర్నిశలు విధి నిర్వహణకే అంకితమయ్యే పోలీసుల సేవలను అభినందిస్తున్నామన్నారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రతి ఒక్క పోలీసు అధికారి, సిబ్బంది తమ విధులను నిజాయితీగా, నిబద్ధతతో నిర్వహించాలని పిలుపునిచ్చారు.01.09.2025 నుండి 31.08.2026 నాటికి భారత దేశ వ్యాప్తంగా 154 మంది పోలీసులు వీరమరణం పొందారన్నారు.అనంతరం దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 154 మంది పోలీసుల పేర్లను అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా చదివి వినిపించారు. వారందరికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, నివాళు లర్పించి 2 నిమిషాల పాటు మౌనం పాటించారు.అమర వీరుల (యుడి వెంకటేశ్వర్లు, అబ్దుల్ కరీం, కె. రాముడు) కుటుంబాల వారిని శాలువ, పూల మాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డిఎస్పీలు దుర్గప్రసాద్, రాఘవేంద్ర, ప్రసాద్, డిపిఓ ఎఓ జగన్నాథరావు, పోలీసు వేల్ఫేర్ డాక్టర్ స్రవంతి , సిఐలు, ఆర్ ఐలు, ఎస్సైలు, ఆర్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది, పోలీసు అమరవీరుల కుటుంబాల వారు పాల్గొన్నారు.





## కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేత

### కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని కోడుమూరు నియోజకవర్గానికి చెందిన 51, 52, 53, 54వ వార్డులకు తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు బీ-ఫారం పత్రాలను అందజేయడం జరిగింది.కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి , కేడీసీసీ చైర్మన్ శ్రీ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో 51వ వార్డు టీడీపీ అభ్యర్థి ఓబులేష్ కి, 52వ వార్డు టీడీపీ అభ్యర్థి రమేష్ కి, 53వ వార్డు టీడీపీ అభ్యర్థి చంద్రశేఖర్ కి, 54వ వార్డు టీడీపీ అభ్యర్థి జయ చంద్ర కి బీ-ఫారం పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవే లక్ష్యంగా, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతూ కర్నూలు నగరంలో తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

## బేతంచెర్ల నగర పంచాయితి ఎన్నికల బరిలో 2 వార్డులలో సిపిఎం పార్టీ పోటీ.






**బేతంచెర్ల అక్టోబర్ 21 ( నంది పత్రిక ).** బేతంచెర్ల నగర పంచాయతీ కౌన్సిలర్ అభ్యర్థులుగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో22వ వార్డుకు ఎస్ యాస్మిన్, 23 వ వార్డు కౌన్సిలర్లుగా వి. సుబ్బారాయుడులు సిపిఎం పార్టీ అభ్యర్థులుగా పోటీలో నిలిచినట్లు సిపిఎం పార్టీ కార్యదర్శి జి వేణుగోపాల్ తెలిపారు. అహర్నిశలు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ ప్రజల పక్షాన నిలబడి ప్రజల కొరకు ప్రజా శ్రేయస్సు కొరకు,నిరంతరం పాటుపడే సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వై.ఎల్లయ్య వి. సుబ్బారాయుడు, బేతంచర్ల పట్టణ కమిటీ నాయకులు బి రామాంజనేయులు, ఆటో మద్దిలేటి స్వామి, ఎస్. ఖాజా బాషా, రాజబాబు వెంకటరమణ టింగు, ఎస్ కే భాష,రామల్ల కోట మద్దయ్య సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ నామినేషన్లు తొలి రోజు బేతంచెర్ల లో నిల్.



**బేతంచెర్ల అక్టోబర్ 21 ( నంది పత్రిక** బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అధికారులు కార్యాలయంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టినప్పటికీ, అభ్యర్థుల నుంచి ఎలాంటి నామినేషన్లు అందలేదు. ఈ సందర్భంగా రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీమతి బషీరున్నిసా బేగం, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీ ఫజుల్ రహిమాన్, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ శ్రీ సునీల్ కుమార్ నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రానున్న రెండు రోజుల్లోనూ కొనసాగనుంది. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తమ నామినేషన్లను దాఖలు చేయవచ్చు.

# కల్లూరు జడ్పిటిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అనిత గ్యాంగి నామినేషన్ దాఖలు

### కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలకు జె లక్ష్మినరసింహ యాదవ్ పిలుపు



**కర్నూలు సిటీ నంది పత్రిక** పాణ్యం నియోజకవర్గం పరిధి కల్లూరు మండల జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చిన్న టేకూరు గ్రామానికి చెందిన అనిత గ్యాంగీ నామినేషన్ దాఖలు చేశారు. ఏఐసిసి సభ్యులు, కర్నూలు జిల్లా ఇంచార్జ్, నంద్యాల మాజీ డీసీసీ అధ్యక్షులు, పాణ్యం నియోజకవర్గ కోఆర్డినేటర్ జెంగిటి లక్ష్మినరసింహ యాదవ్ సమక్షంలో అనిత గ్యాంగి నామినేషన్ వేశారు కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నయ్య సతీమణి అనిత గ్యాంగీ. ఈ కార్యక్రమంలో కర్నూలు మాజీ డి సి సి అధ్యక్షులు బాబురావు, కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెంగిటి లక్ష్మినరసింహ యాదవ్ మాట్లాడుతూ అనిత గ్యాంగిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలిపిస్తే, కల్లూరు మండల ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవించండి. అభ్యర్థుల పనితీరును పరిశీలించండి. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వండి. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వండి. కల్లూరు మండల జడ్ పి టి సి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అనిత గ్యాంగిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కల్లూరు మండల ప్రజలందరినీ జెంగిటి లక్ష్మినరసింహ యాదవ్ కోరారు.

## కల్లూరు అర్బన్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా కాటసాని రామభూపాల్ రెడ్డి ఇంటింటి ప్రచారం



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు అర్బన్ 38వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థి ఎద్దుల ప్రవళిక, కర్నూలు నగర మేయర్ అభ్యర్థి సుశీల కి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి కల్లూరు అర్బన్‌లోని 38వ వార్డు షరీన్ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎద్దుల ప్రవళిక, కర్నూలు నగరం మేయర్ అభ్యర్థి సుశీల ని గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు. ఇంటింటికీ వెళ్లి అభ్యర్థులను పరిచయం చేస్తూ, ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి , కార్పొరేటర్ అభ్యర్థి చిట్టి బాబు, ఎద్దుల శివారెడ్డి , వార్డులోని నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రీషియన్ కుటుంబానికి పీస్ సేవా సంస్థ చేయూత

**కడప అక్టోబర్ 21(నందిపత్రిక రిపోర్టర్)** వై.యస్.ఆర్.కడప జిల్లా, ఖాజీపేట మండలం, మల్లాయపల్లి గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ డేవిడ్ గత కొన్ని నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆరోగ్యం క్షీణించింది. ప్రస్తుతం కడప రిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పోషణ ప్రశ్నార్థకంగా మారింది.విషయం తెలుసుకున్న పీస్ సేవా సంస్థ సభ్యులు బుధవారం అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబానికి పండ్లు, బియ్యం మరియు నిత్యావసర సరుకులు అందజేశారు.ఈ సందర్భంగా పీస్ సేవా సంస్థ సభ్యులు మహబూబ్ బాషా (మదీనా) మాట్లాడుతూ... ఇలాంటి ఇబ్బందుల్లో ఉన్నవారిని కొంతైనా ఆదుకోవడం చాలా తృప్తిగా ఉందని, ఇలాంటి సేవా భావం ప్రతి ఒక్కరిలో రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌసులాజమ్, మహబూబ్ హుస్సేన్, హాజీ గౌస్, వలీ బాషా మరియు షాహిద్ లు పాల్గొన్నారు.



## వైఎస్ఆర్సిపి అభ్యర్థులను అత్యధిక మెజార్టితో గెలిపించాలి.

### పట్టణంలో పర్యటించిన వైఎస్ఆర్సిపి యువ నాయకులు బుగ్గన అర్జున్ రెడ్డి.

**బేతంచెర్ల అక్టోబర్ 21 ( నంది పత్రిక ).** బేతంచెర్ల పట్టణంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు యువ నాయకులు బుగ్గన అర్జున్ రెడ్డి బేతంచెర్ల పట్టణంలోని వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలతో ఇల్ల వద్దకు వెళ్లి వైసిపి నాయకుల యోగ గక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.వారు అర్జున్ రెడ్డి కి శాలువాలు వేసి పూలదండలతో సత్కరించారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల లో వైఎస్ఆర్సిపి అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు జ్యోతి,మల్లికార్జున కుటుంబ సభ్యులను అలాగే నాయిని బ్రాహ్మణులను,అంబాపురం మద్దిలేటి, కాంట్రాక్టర్ ఖాదర్ బాషా, శ్రీకాంత్, రెడ్డి సంఘం అధ్యక్షులు బొల్లవరం భాస్కర్ రెడ్డి, సాహెబ్ ఖాన్, పురుషోత్తం రెడ్డి, ముస్తఫా,ఆర్టీసీ జి. రమణ హరికృష్ణ, బుగ్గన సురేంద్రనాథ్ రెడ్డి, మర్రికుంటతిమ్మారెడ్డి, బుగ్గన మధుసూదన్ రెడ్డి, చిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి గార్ల కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్, రాఘవేంద్ర రెడ్డి, కాజా, నజీర్, రియాజ్, మంగలి మద్దిలేటి స్వామి, వెంకటేశ్వర్లు, గంగాధర్, పుల్లయ్య, గోవిందు మంగలి శీను తదితరులు పాల్గొన్నారు.



## 44వ వార్డు కూటమి బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థి బి రమాదేవిని గెలిపించండి

### మహాత్మా నగర్ లో విస్తృతప్రచారం చేసిన కూటమి నాయకులు



**కర్నూలు సిటీ నంది పత్రిక** కల్లూరు కూటమి మద్దతుతో బిజెపి 44 వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి బి రమాదేవి విజయాన్ని కోరుతూ కూటమి నాయకులు మహాత్మా నగర్ నందు ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో కూటమి టిడిపి నాయకులు పవన్, బిజెపి నాయకులు జి ఎస్ నాగరాజు, మద్దిలేటి యాదవ్, మీసాల గంగాధర్, సంపతి తారకేశవరెడ్డి, బి కె రవి, టిడిపి, బిజెపి కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# రాజకీయ హంగామా

**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 21:** మండల ప్రాదేశిక సభ్యుల నామినేషన్ల కు సంబంధించిన ఘట్టం రాజకీయ ప్రకంపనలను సృష్టించింది. గత వైఎస్ఆర్ ప్రభుత్వంలో జరిగిన ఎన్నికలలో పోలీసులను అడ్డం పెట్టుకొని ఏకగ్రీవాలను చేసుకున్న రీతిలోనే అధికార పార్టీ, నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అన్న పద్ధతిలో ఈ ఎన్నికలలో పోలీసు యంత్రాంగాన్ని పావులుగా వాడుకునేందుకు ప్రయత్నాలు చేసింది. ప్రయత్నించడం ఏమిటి? ఈ ఎన్నికలకు మీరే సారథ్యం వహించాలంటూ ఒక విధంగా అధికార పార్టీ హుకూమ్ నే జారీ చేసినట్లు తెలుస్తోంది. బుధవారం నామినేషన్లకు సంబంధించిన ప్రక్రియ ఇదే రీతిలో సాగింది. ఈ విధానాన్ని పోలీసులు పకడ్బందీగా అమలు చేసినట్లుగా తెలుస్తోంది. శాంతి భద్రతలను సాకుగా పెట్టి, తొలిరోజు వైయస్సార్ పార్టీకి చెందిన ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లకు రావాల్సిన అవసరం లేదని వెలుగోడు ,బండి ఆత్మకూరు, మహానంది మండలాల్లోపోలీసు యంత్రాంగం అన్ని గ్రామాలలోని ప్రజలకు చరవాణి ద్వారా ఆర్డర్ వేసినట్లుగా తెలుస్తోంది. ఈ కారణంగా మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ల పర్వానికి ఆ పార్టీకి చెందిన అభ్యర్థులు ఎవరు హాజరు కాలేదు. అయితే ఉదయమే అధికార పార్టీకి చెందిన నాయకులందరూ తమ పార్టీ కార్యాలయాల్లో మండల పరిషత్ కార్యాలయ పరిసరాల్లో తిష్ట వేసి రాజకీయ హంగామా సృష్టించేందుకు సిద్ధమయ్యారు. బుధవారం మధ్యాహ్నం నాటి నుండి తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు ఒక్కొక్కరి నామినేషన్ వేసేందుకు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం నాటినుండి టిడిపి చెందిన అభ్యర్థులు నామినేషన్లు వేస్తూ ఉండటంతో వైసీపీ పార్టీకి చెందిన నాయకులు ఆందోళనలో పడ్డారు.తాము నామినేషన్లు వేసుకునేందుకు రాజకీయ కుట్రలు జరుగుతున్నాయా అనే రీతిలో ఆ పార్టీ కార్యకర్తలు భ్రమ పడిపోయారు. ఒక దశలో రెండు పార్టీలు రాజీ ప్రయత్నాలు చేసుకుంటున్నారన్న పుకార్లు షికార్లు చేశాయి. రాజీ ప్రయత్నాలు జరిగే పరిస్థితి ఉంటే నామినేషన్లు జరిగే ప్రాంతంలో ఒక అధికార పార్టీకి చెందిన నాయకులే కనిపించారు కానీ, వైయస్సార్ పార్టీకి చెందిన నాయకులు ఎవరు ఆ దరిదాపులో కూడా దీనిబట్టి చూస్తే రాజీల మంత్రం చివరకు ఈ విషయం పుకార్లు అనే బట్టబయలైంది. నామినేషన్ల జరిగే ప్రాంతం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం భద్రతా చర్యలు చేపట్టాలని నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ సుస్మితా రంగనాథన్ రెండు రోజుల క్రితం ఈ ప్రాంతాన్ని సందర్శించి ఆదేశాలు జారీ చేయడంతో, పోలీసు పకడ్బందీగా బందోబస్తు చర్యలను చేపట్టారు. గురువారం వైసీపీ పార్టీకి చెందిన అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**8 ఎంపీటీసీలకు 14నామినేషన్లు** బండి ఆత్మకూరు మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, బుధవారం 8 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 14మంది అభ్యర్థులు నామినేషన్లను సమర్పించారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీ లావతి బుధవారం రాత్రి ప్రకటించారు. చిన్నదేవలాపురం జనరల్ స్థానానికి మద్దినేని శివుడు నడిపి వెంకటేశ్వర్లు, లింగాపురం జనరల్ మహిళ స్థానానికి షాహిదా, మద్దూరు శివ భారతి, పార్నపల్లి బీసీ మహిళ స్థానానికి వీపనగండ్ల లావణ్య ,జయలక్ష్మి, ఏ కోడూ రు ఎస్సీ మహిళా స్థానానికి మల్లె పోగుల నాగలక్ష్మమ్మ , ఎర్రగుంట్ల జనరల్ మహిళా స్థానానికి దే రెడ్డి ,కాటిరెడ్డి లక్ష్మీదేవి, ఈర్నపాడు జనరల్ స్థానానికి బండి శ్రీనివాసులు, బండి ఆత్మకూరు జనరల్ ఒకటి స్థానానికి బైరెడ్డి లక్ష్మి రెడ్డి, నందిపాటి సృజన, బండి ఆత్మకూరు జనరల్ మహిళా స్థానానికి సయ్యద్ మాబున్నీ, బైరెడ్డి లక్ష్మీదేవి, జీవనకాళ్ళ రిజ్వానా బేగం తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.





## మహానందిలో ప్రశాంతంగా తొలిరోజు నామినేషన్ల ప్రక్రియ..

### 6 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు



**మహానంది అక్టోబర్ 21 (నంది పత్రిక):-** మహానంది మండలంలో తొలిరోజు నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. మొదటి రోజు మొత్తం 6 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి ఎస్. అబ్దుల్ రహిమాన్ పేర్కొన్నారు. నామినేషన్లు దాఖలు చేసిన వారందరూ తెలుగుదేశం పార్టీ (ఒణా) కి చెందిన అభ్యర్థులని ఆయన స్పష్టం చేశారు.గ్రామాల వారీగా నామినేషన్లు వేసిన అభ్యర్థుల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

**మసీదుపురం :** ఆవుల సుబ్బలక్ష్మమ్మ, పుస్తెల శ్రీలక్ష్మీ,

**బొల్లవరం :** నిమ్మ చెట్ల మదార్ వలి, తురగ నాగేశ్వరరావు, కిలారి పుల్లయ్య

**మహానంది :** నందిమల్ల వెంకట సుబ్బమ్మ

ఈ నామినేషన్ల ప్రక్రియలో సహాయ రిటర్నింగ్ అధికారులు (ఆ=ాం) గా ఎంపీడీవో మహబూబ్ దౌలా, తహసీల్దార్ రమాదేవి వ్యవహరించారు.ఎన్నికల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూసేందుకు నామినేషన్ కేంద్రం పరిసరాల్లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ శివాంజల్ ఆధ్వర్యంలో సుమారు 50 మందికి పైగా పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి నిఘా ఉంచినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.



# 25 నుంచి 'అమీన్ పీర్ దర్గా' ఉరుసు మహోత్సవాలు..!

**ఆధ్యాత్మిక వైభవంగా ఆరు రోజుల వేడుకలు**

**27న 82వ జాతీయ ఉర్దూ కవి సమ్మేళనం, ముషాయిరా**

**కడప, అక్టోబర్ 21. నంది పత్రిక:** కడప నగరంలోని ప్రసిద్ధ అమీన్ పీర్ దర్గాలో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు ఉరుసు మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా ముఖ్య ముజావర్ అమీరుద్దీన్, నిర్వాహకుడు మహమ్మద్ అలీ ఖాన్ తెలిపారు.బుధవారం అమీన్ పీర్ దర్గా ప్రాంగణంలోని.. ముషాయిరా హాలులో.. అమీన్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవాల నిర్వహణకు సంబంధించి పోస్టర్లను దర్గా ముఖ్య ముజావర్ అమీరుద్దీన్, నిర్వాహకుడు మహమ్మద్ అలీ ఖాన్ సంబంధిత దర్గా కమిటీ సభ్యులు, మత పెద్దలతో కలిసి.. ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.పెద్ద దర్గా పీఠాధిపతి ఆధ్వర్యంలో జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా గంధ మహోత్సవం, చాదర్ సమర్పణ, ప్రత్యేక ప్రార్థనలు, ఖవ్వాలి కార్యక్రమాలతో పాటు 82వ జాతీయ ఉర్దూ కవి సమ్మేళనం, ముషాయిరా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కడప అమీన్ పీర్ రోడ్డులోని ఆస్థాన్-ఏ-మగ్దూముల్లాహి అమీన్ పీర్ దర్గాలో హజరత్ సూఫీ సర్ మస్త్ సాని చిల్లాకష్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేని చిష్తీ ఖాదరి (మస్తాన్ సాహెబ్ పీర్ సాహెబ్) వారి ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకుని ఆరు రోజుల పాటు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వివరించారు.



**25న గంధ మహోత్సవం** ఈ నెల 25న గంధ మహోత్సవం, గంధ కలశం ఊరేగింపు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. 26న ఉరుసు వేడుకలు, చాదర్ సమర్పణ, ఖవ్వాలి కార్యక్రమాలు జరగనున్నాయి.

**27న 82వ జాతీయ ఉర్దూ కవి సమ్మేళనం** ఈ నెల 27న ప్రత్యేక ప్రార్థనల అనంతరం రాత్రి 10 గంటలకు 82వ జాతీయ ఉర్దూ కవి సమ్మేళనం, ముషాయిరా నిర్వహించనున్నారు. ఇందులో ఉర్దూ కవులు తమ కవితా గానం ద్వారా సాహిత్యాభిమానులను అలరించనున్నారు.

**28న రాత్రంతా ఖవ్వాలి కార్యక్రమాలు** ఈ నెల 28న ప్రముఖ ఖవ్వాలి కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు సాగే ఖవ్వాలి గానంతో దర్గా ప్రాంగణం ఆధ్యాత్మిక సందడిని సంతరించుకోనుంది.

**29న మస్తాన్ స్వామి తపస్సు చేసిన గుహ వద్ద ప్రత్యేక ప్రార్థనలు**

ఈ నెల 29న శేషాచల పర్వతంలోని మస్తాన్ స్వామి తపస్సు చేసిన గుహ వద్ద ప్రత్యేక ప్రార్థనలు, జెండా ప్రతిష్ఠ, అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నారు. అనంతరం కడపలోని అమీన్ పీర్ దర్గాలో పూల చాదర్ సమర్పణ, ఖవ్వాలి కార్యక్రమాలు జరగనున్నాయి.

**భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి** ఉరుసు మహోత్సవాల్లో భక్తులు, సూఫీ పండితులు, కవులు, సాహిత్యాభిమానులు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని దర్గా నిర్వాహకులు కోరారు.

## మహానందిలో మహా పూర్ణాహుతితో వైభవంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు...

### శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు, కనుల పండువగా స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం



**మహానంది అక్టోబర్ 21 )నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో శ్రీ కామేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం మహా పూర్ణాహుతితో అత్యంత వైభవంగా ముగిశాయి. ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ ముగింపు వేడుకల్లో వేద పండితులు రవిశంకర్ అవధాని బృందం, రుత్వికులు మరియు అర్చకులు యాగశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఉత్సవాల ముగింపు సందర్భంగా అర్చకులు శాస్త్రోక్తంగా కలశ ఉద్వాసన కార్యక్రమాన్ని పూర్తి చేసి, పవిత్ర కలశ జలాలతో శ్రీ కామేశ్వరి



సహిత మహానందీశ్వర స్వామివార్లకు సంప్రదాయబద్ధంగా అభిషేకం చేశారు. అనంతరం సాయంత్రం వేళ స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో భాగంగా ఈశ్వర్ నగర్ కాలనీలోని శమీ వృక్షం (జమ్మి చెట్టు) వద్దకు చేరుకుని, ఈవో శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో వేదపండితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపారు.అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మరియు తిమ్మాపురం, బుక్కాపురం,గ్రామాల్లో వైభవంగా విజయదశమి వేడుకలు నిర్వహించారు.అనంతరం స్వామివార్ల ఉత్సవ మూర్తులకు నేత్ర శోభితంగా గ్రామోత్సవం నిర్వహించారు.



# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



**ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు ప్రశంసనీయం**

**పోలీసు అమరవీరుల స్థూపానికి ఘనంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, పోలీసు అధికారులు**

**నంద్యాల బ్యూరో, అక్టోబరు 21(నంది పత్రిక):-** దేశ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ కమేమరేషన్ డే) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్, సబ్ కలెక్టర్ మనీషా, అదనపు ఎస్పీ ఖాదర్ బాషా, ఎస్డీపీఓ సుస్మిత తదితర పోలీసు అధికారులు పాల్గొని పోలీసు అమరవీరుల స్థూపానికి పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్న పోలీసుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడటం, నేరాలను అరికట్టడం, ప్రజలకు భద్రత కల్పించడం వంటి బాధ్యతలను నిర్వర్తించే క్రమంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తుచేసుకున్నారు. పోలీసు సేవలు కేవలం విధి నిర్వహణకే పరిమితం కాకుండా ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, బాధితులకు న్యాయం అందేలా కృషి చేయడం వంటి విస్తృతమైన బాధ్యతలను కలిగి ఉన్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి, ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం వంటి కీలక అంశాల్లో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, వారి సమస్యలను సహనంతో ఆలకించి, ఇరువర్గాల వాదనలను సమగ్రంగా పరిశీలించి న్యాయబద్ధంగా స్పందించడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెంపొందించేలా పారదర్శకత, నిబద్ధత, సేవాభావంతో విధులు నిర్వహించడం ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల కుటుంబాల త్యాగాలు కూడా వెలకట్టలేనివని, అటువంటి కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా నిలిచి, వారి సంక్షేమానికి భరోసా కల్పించాల్సిన ప్రాధాన్యత ఉందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పోలీసు అమరవీరుల ధైర్యసాహసాలు, అంకితభావం, త్యాగనిరతి భావితరాలకు స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవలో నిబద్ధతతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. అదనపు ఎస్పీ ఖాదర్ బాషా మాట్లాడుతూ, 1959 అక్టోబర్‌లో లడఖ్‌లో చైనా బలగాల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీసు సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసు ఉద్యోగం కేవలం జీవనోపాధి కాదని, అది బాధ్యతతో కూడిన ప్రజాసేవ అని పేర్కొన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ, పండుగలు, అత్యవసర సమయాల్లోనూ ప్రజల రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వర్తించే పోలీసుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. నేరాల నియంత్రణలో కఠినంగా వ్యవహరిస్తూ, చట్టాల అమలులో నిష్పక్షపాతంగా, ప్రజల పట్ల మానవీయ దృక్పథంతో పనిచేయడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులకు కానుకలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దు





**స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ హాళ్లలో పటిష్ట భద్రత కల్పించాలి**

**సీసీ కెమెరాల నిఘా, ఎన్నికల సామగ్రి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**నంద్యాల పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

**నంద్యాల బ్యూరో, అక్టోబర్ 21(నంది పత్రిక):–** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ హాళ్లలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నంద్యాల మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ హాళ్ల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి, చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్ట్రాంగ్ రూమ్‌లలో ఎన్నికల సామగ్రి భద్రపరచడం నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఎలాంటి పొరపాట్లకు, నిర్లక్ష్యానికి తావులేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉండేలా చూడాలని, లైవ్ ఫీడ్ పర్యవేక్షణకు అవసరమైన సాంకేతిక ఏర్పాట్లను ముందుగానే తనిఖీ చేయాలని ఆదేశించారు. రిసెప్షన్ సెంటర్‌లో ఎన్నికల సిబ్బంది నుంచి ఎన్నికల సామగ్రి స్వీకరణ, పరిశీలన, నమోదు, క్రమబద్ధీకరణ ప్రక్రియలు సజావుగా జరిగేలా తగిన స్థలం, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ హాళ్లలో ఓట్ల లెక్కింపునకు అనువైన ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, వారి ఏజెంట్లకు నిబంధనల ప్రకారం సీటింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. టేబుళ్ల మధ్య తగినంత దూరం, స్పష్టమైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులకు సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేసి, వాటి తరలింపు, స్వీకరణ, భద్రపరిచే ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, భద్రత మరియు విధుల నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న సంబంధిత అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## జెడ్పీటీసీ నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి

**100 మీటర్ల పరిధిలో ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలి**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల బ్యూరో, అక్టోబరు 21(నంది పత్రిక):–** జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పోలీసు, ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, హెల్ప్‌డెస్క్ సిబ్బంది విధులు నిర్వహించే ప్రదేశాలను తనిఖీ చేసి, అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధికి వెలుపల వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలని, కేంద్రం వద్ద అనవసర గుమిగూడింపులు, ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనుమతించిన వ్యక్తులనే నిబంధనల ప్రకారం కేంద్రంలోకి అనుమతిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సంబంధిత అధికారులు సమన్వయంతో, పారదర్శకంగా నిర్వహించాలని, అభ్యర్థులందరికీ నిబంధనల ప్రకారం సమాన అవకాశాలు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిబంధనలను అధికారులు ఖచ్చితంగా పాటించాలి

**జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, మున్సిపల్ కమిషనర్ ఎం. జయకృష్ణ**



**తిరుపతి, బ్యూరో చీఫ్ అక్టోబరు 21: నంది పత్రిక** మున్సిపల్ సాధారణ ఎన్నికలు2026లో భాగంగా ఈ నెల 28న నిర్వహించనున్న పోలింగ్ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలను అధికారులు ఖచ్చితంగా పాటించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు మరియు మున్సిపల్ కమిషనర్ ఎం. జయకృష్ణ సూచించారు.పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ, బ్యాలెట్ బాక్సుల వినియోగంపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి బుధవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ సిబ్బంది తమ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు.ప్రిసైడింగ్ అధికారులు తప్పనిసరిగా పి.ఓ. డైరీని వినియోగించాలని, ఎన్నికల విధులకు సంబంధించిన హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా చదివి అందులోని నిబంధనలు, విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాలని పేర్కొన్నారు.శిక్షణ కార్యక్రమంలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారుల విధులు, ఎన్నికల నియమావళి అమలు, ఓటర్లకు అవసరమైన సౌకర్యాల కల్పన, ఎన్నికల సామగ్రి నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.బ్యాలెట్ బాక్సుల వినియోగం, పోలింగ్ ప్రారంభానికి ముందు నిర్వహించాల్సిన తనిఖీలు, బ్యాలెట్ బాక్సుల సీలింగ్ ప్రక్రియ, వాటి భద్రత, రవాణా, పోలింగ్ ముగిసిన అనంతరం బాక్సులను సంబంధిత అధికారులకు అప్పగించే విధానాలను వివరించారు. ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన ప్రతి విధానాన్ని నిబంధనల ప్రకారం అమలు చేయాలని సూచించారు.పోలింగ్ సిబ్బంది విధుల నిర్వహణలో పూర్తి బాధ్యతాయుతంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల విధులపై పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

**పోలింగ్ కేంద్రాల రూటింగ్, లొకేషన్లపై ముందస్తు అవగాహన కలిగి ఉండాలి**

**పీఓలు, ఏపీఓల తొలి విడత శిక్షణలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, అక్టోబరు 21(నంది పత్రిక):–** మున్సి పాలిటీలు, నగర పంచాయతీల రెండో సాధారణ ఎన్నికలు–2026 నిర్వహణలో భాగంగా పోలింగ్ అధికారులు, అదనపు పోలింగ్ అధికారులు ఎన్నికల విధులపై పూర్తి అవగాహన పెంపొందించుకుని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీఓలు, ఏపీఓల తొలి విడత శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధుల నిర్వహణ, పోలింగ్ ప్రక్రియ, ఎన్నికల నిబంధనల అమలుపై ప్రతి అధికారి పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన రూటింగ్, లొకేషన్ల వివరాలను ముందుగానే తెలుసుకోవడంతో పాటు, పోలింగ్‌కు ముందు రోజే తమకు కేటాయించిన కేంద్రాలను సందర్శించి, అక్కడికి చేరుకునే మార్గాలు, పరిసరాలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. దీనివల్ల పోలింగ్ రోజున ఎలాంటి గందరగోళానికి తావులేకుండా, నిర్ణీత సమయానికి విధులను ప్రారంభించి, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు వీలవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పరిధిలోనే ఉంటూ, బృంద సభ్యులతో సమన్వయం చేసుకోవాలని, విధుల నిర్వహణలో సంయమనం, క్రమశిక్షణ పాటించాలని పేర్కొన్నారు. ఎన్నికల విధులకు సంబంధించిన నియమ నిబంధనలపై పూర్తి పట్టు సాధిస్తే విధుల నిర్వహణ సులభతరమవుతుందని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది నియామకం, విధుల కేటాయింపు వివరాలను స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళి, సంబంధిత ఎన్నికల నిబంధనలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. ప్రతి అధికారి తనకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలోనే విధులు నిర్వర్తిస్తూ, ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి విమర్శలకు ఆస్కారం లేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ప్రతి అధికారి అప్రమత్తంగా, నిబద్ధతతో వ్యవహరించి, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## నగర పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించండి.

**-డోన్ ఎమ్మెల్యే కుమార్తె చిత్రమ్మ**



**బేతంచెర్ల, 21 ( నంది పత్రిక )** బేతంచెర్ల నగర పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ ప్రచారం జోరందుకుంది. బేతంచెర్ల నగర పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థులను, చైర్మన్ అభ్యర్థి టి. లోకేష్ గౌడ్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కుమార్తె చిత్రమ్మ పిలుపునిచ్చారు.మంగళవారం బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో 4వ వార్డు, 5వ వార్డుల్లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి మహిళలు, వృద్ధులు, యువతతో మాట్లాడుతూ ఎమ్మెల్యే హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా చిత్రమ్మ మాట్లాడుతూ – "గతంలో ఎన్నడూ లేని విధంగా బేతంచెర్ల నియోజకవర్గంలో అభివృద్ధి జరిగింది. రోడ్లు, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ, వీధి దీపాలు, పేదలకు సంక్షేమ పథకాలు అన్నింటిలోనూ ఎమ్మెల్యే ముందున్నారు. ఈ అభివృద్ధి మరింత వేగంగా జరగాలంటే నగర పంచాయతీలో కూడా టీడీపీ బలపరిచిన అభ్యర్థులు గెలవాలి" అని ఆమె కోరారు. మరింత అభివృద్ధి జరగాలంటే నగర పంచాయతీ చైర్మన్ అభ్యర్థి టి. లోకేష్ గౌడ్, 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి భూషణం, 4వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి శ్రీధర్ లను అత్యధిక మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పలువురు మహిళలు హారతులు ఇచ్చి ఆహ్వానించారు. యువత స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భీమేష్ రెడ్డి, బుగ్గనపల్లె సతీష్, సత్యం, సాకలి శీను, గఫూర్, బాలరాజు, రామచంద్రుడు, కొమ్మలపల్లె రమణ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడు ఆకస్మిక మరణం బాధాకరం.... మాజీ ఎంపీపీ వీరభద్రుడు..



**చాగలమర్రి అక్టోబర్ 21 నంది పత్రిక** సీనియర్ పాత్రికేయుడు, సౌమ్యుడు, ఆకస్మిక మరణం బాధాకరమని మాజీ ఎంపీపీ వీరభద్రుడు అన్నారు. మృతి చెందిన విషయం తెలుసుకున్న వీరభద్రుడు జర్నలిస్ట్ సొంత గ్రామమైన బ్రాహ్మణపల్లికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ సర్పంచులు బాబు, గోవిందయ్య, గిరి, లక్ష్మయ్య, రంగయ్యలు సంతాపం తెలిపారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు.. ఎస్సై 144 సి ఆర్ పి సి సెక్షన్ అమలు..



**చాగలమర్రి అక్టోబర్ 21 నది పత్రిక** ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల నామినేషన్ల సందర్భంగా, నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరగడానికి చాగలమర్రి మండలంలో 144 ఓల్డ్ సి ఆర్ పి సి సెక్షన్ తోపాటు 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలులో ఉంటుందని ఎస్సై నాగేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపుగా చేరడం కానీ, అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించడం, కర్రలు ఇతర ఆయుధాలు తీసుకువెళ్లడం నిషేధించడం అయిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తమ ఓటు హక్కును ఓటరు వినియోగించుకునేందుకు సహకరించాలని కోరారు.

## 38వ వార్డు కార్పొరేటర్ గా దాసరి శృతిని గెలిపించండి

**టిడిపి యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి**

**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూల్ కార్పొరేషన్ 38వ వార్డు నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న దాసరి శృతిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టిడిపి యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వార్డులోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఇంటింటి ప్రచారం చేస్తూ ఓటర్లను కలుసుకుని కార్పొరేటర్ గా దాసరి శృతిని మేయర్ అభ్యర్థిగా బోల్లెద్దుల ప్రత్యూషను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.కె శ్రీనివాసరావు నాయకుడు వై కుమార్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## 26వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైజా బాలచంద్రారెడ్డి

**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూల్ కార్పొరేషన్ పరిధిలోని 26వ వార్డు కార్పొరేటర్ గా వైఎస్ఆర్సిపి అభ్యర్థి వైజా బాలచంద్రారెడ్డినీ అధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ కార్పొరేటర్ వైజా అరుణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం వార్డు పరిధిలోని కాలనీలలో విస్తృత ప్రచారం చేసి ఓటర్లను కలిసి ఓటు వేయవలసిందిగా అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## ఎన్నికల వేళ నిరంతరం అప్రమత్తంగా ఉండాలి : ఏఎస్పీ సుస్మిత



**మహానంది అక్టోబర్ 21 (నంది పత్రిక):-** మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో గల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను ఏఎస్పీ సుస్మిత పరిశీలించారు. బుధవారం ఆమె ఎంపీడీవో కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి, భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో, నిష్పక్షపాతంగా సాగాలని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రం పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ మరియు 100 మీటర్ల నిబంధనను అత్యంత పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించి కేంద్రాల వద్ద గుమిగూడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తిగా ముగిసేంతవరకు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలను కాపాడాలని స్థానిక ఎస్సై శివాంజల్‌కు దిశానిర్దేశం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా గట్టి నిఘా ఉంచాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఏఎస్పీ సుస్మిత పిలుపునిచ్చారు. అనంతరం విజయదశమి పండుగ పురస్కరించుకొని శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర దర్శించుకుని అభిషేకార్చన పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## వెలుగోడు మండలంలో రెండో విడత ఎంపీటీసీ అభ్యర్థులను ప్రకటించిన ఎస్‌డీపీఐ




**వెలుగోడు (అక్టోబర్ 21) నంది పత్రిక:** వెలుగోడు మండలం లోని స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా కదనరంగంలోకి దిగింది. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా స్థానిక పోరుకు సిద్ధమవుతున్నట్లు పార్టీ నాయకులు స్పష్టం చేశారు. అందులో భాగంగా వెలుగోడు మండలంలో రెండో విడత ఎంపీటీసీ పోటీదారుల జాబితాను పార్టీ అధిష్టానం బుధవారం అధికారికంగా విడుదల చేసింది. రెండో విడతలో భాగంగా స్థానిక ప్రజల్లో మంచి గుర్తింపు, సేవా నిరతి కలిగిన నలుగురు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు పార్టీ వెల్లడించింది.

**ప్రకటించిన అభ్యర్థుల వివరాలు:**

వెలుగోడు 2వ ఎంపీటీసీ అభ్యర్థి: సయ్యదా గౌస్యాబి

వెలుగోడు 5వ ఎంపీటీసీ అభ్యర్థి: సయ్యద్ రసూల్

వెలుగోడు 6వ ఎంపీటీసీ అభ్యర్థి: షేక్ తస్లీమ్ (షేక్ ఇమ్రాన్ సతీమణి)

రేగడగూడూరు 2వ ఎంపీటీసీ అభ్యర్థి: లింకన్ రాజు

ప్రజల గొంతుకగా పోరాడటమే మా లక్ష్యం: ఈ సందర్భంగా ఎస్‌డీపీఐ నాయకులు మాట్లాడుతూ.. గ్రామాల సమగ్ర అభివృద్ధి, స్థానికంగా నెలకొన్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారం, ప్రజలకు పారదర్శకమైన మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా ఈ ఎన్నికలను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. సామాన్య ప్రజల ప్రాథమిక హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి గొంతుకగా నిలవడమే తమ పార్టీ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. "ప్రజల కోసం.. ప్రజలతో కలిసి ముందుకు సాగుతాం" అని, ఎన్నికల్లో ఎస్‌డీపీఐ అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ఈ సందర్భంగా వారు ప్రజలను అభ్యర్థించారు.

## ఘనంగా యాదవ రాజులు, రక్షక భటుల సన్మానం

### మద్దికేరలో 80 మందికి సత్కారం



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా మద్దికెర గ్రామంలో యాదవ సంస్థాన చరిత్రలో మరపురాని ఘట్టం. మద్దికెర యాదవ రాజులను, వారికి అండగా నిలిచిన రక్షక భటులను అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సుమారు 80 మంది యాదవ రాజులు, రక్షక భటులను ఈ సందర్భంగా శాలువా కప్పి, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అఖిల భారత యాదవ మహాసభ రాయలసీమ జిల్లాల కన్వీనర్ శేషపాణి యాదవ్, ప్రముఖ రచయిత, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ నాగమ్మ, యర్రగొల్ల మహేష్ యాదవ్ హాజరై సన్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మద్దికెర యాదవ రాజుల పోరాటం, త్యాగం నేటి యువతకు స్ఫూర్తి అని, రక్షక భటుల సేవలను చరిత్ర ఎప్పటికీ మరువదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాటమరాజు యాదవ యువ సైన్యం నాయకులు రమేష్ యాదవ్, ఓబయ్య యాదవ్, బహుజన విద్యార్థి సంఘం నాయకుడు దత్తు యాదవ్, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తొలి రోజు ఒకే నామినేషన్ దాఖలు

### నామినేషన్ల కేంద్రం వద్ద రాజకీయ సందడి.. స్వతంత్ర అభ్యర్థిని అడ్డుకున్నారంటూ ఆరోపణలు



**వెలుగోడు, అక్టోబర్ 21 (నంది పత్రిక):** వెలుగోడు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ బుధవారం జరిగింది. మండల పరిషత్ నామినేషన్ ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ వెబ్‌సైట్ తొలిరోజు కేవలం ఒక్క దాఖలైంది. మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, రేగడగూడూరు-1 ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరపున సోఫీ సాహెబ్ నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హీరా నాయక్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం సమీపంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గుమి కూడడంతో రాజకీయ సందడి నెలకొంది. తొలిరోజు వైఎస్సార్‌సీపీ నుంచి ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు.

**స్వతంత్ర అభ్యర్థిని అడ్డుకున్నారంటూ ఆరోపణలు** గుంతకందాలకు చెందిన నాగార్జున అనే యువకుడు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడానికి రాగా, టీడీపీ నాయకులు అడ్డుకుని వెనక్కి పంపించారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై నాయకుల వివరణ తెలియాల్సి ఉంది. నామినేషన్ పత్రంపై సందేహాల నివృత్తికి అనుమతి లేదని ఎస్‌డీపీఐ ఆగ్రహంనామినేషన్ పత్రంలో ఉన్న కొన్ని సందేహాలను రిటర్నింగ్ అధికారి ద్వారా నివృత్తి చేసుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు, అనుమతించలేదని ఎస్డీపీఐ నాయకులు. మరుసటి రోజు రావాలని చెప్పి వెనక్కి పంపించారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్ దాఖలు చేయడానికి ముందే పత్రాల్లోని సందేహాలను నివృత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ స్పష్టంగా, ప్రశాంతంగా సాగేలా జిల్లా కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని ఎస్డీపీఐ నాయకులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురారి తాసిల్దార్ మంజుల రెడ్డి పాల్గొన్నారు.

## మేయర్ అభ్యర్థి విజయ ప్రత్యూషను, కార్పొరేటర్ అభ్యర్థులు రాఘవేంద్ర ఆచారిని, శివపార్వతిని అధిక మెజార్టీతో గెలిపించండి

### టిడిపి యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూల్ మేయర్ అభ్యర్థి విజయ ప్రత్యూషను, 48వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి రాఘవేంద్ర ఆచారిని, 49వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి శివ పార్వతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టిడిపి యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు 48, 49 వ వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కర్నూలు నగర అభివృద్ధి కోసం టిడిపి అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించాలని కోరారు. కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ రాష్ట్రంలో కూటమి సర్కార్ కర్నూల్ నగరంలో టిడిపి పాలన రావాలని దీంతో ప్రజాసంక్షేమం ముందుకు సాగుతుందన్నారు కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు జి గంగాధర్ గౌడ్ నాయకులు జనార్ధన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో పోలీసుల కవాతు..

### నామినేషన్ల ఉపసంహరణ నేపథ్యంలో ముందస్తు బందోబస్తు



**నంది పత్రిక ఆత్మకూరు..** ఆత్మకూరు: మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ నేపథ్యం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆత్మకూరు ఎస్సై నారాయణరెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులు పట్టణంలో కవాతు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ పట్టణంలో ఎవరైనాను అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని తెలియజేస్తూ శాంతిభద్రతల పరిరక్షణపై ప్రజలకు భరోసా కల్పించారు. లిఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశాలతో డిఎస్పి సూచనల మేరకు ఈరోజు ఆకుమూరు పట్టణంలో పోలీస్ కవాతు నిర్వహించడం జరిగింది

## జూపాడుబంగ్లా టిడిపి జడ్పీటిసిఅభ్యర్థిగా మాధవరం శాంతి కుమారి.



**జూపాడుబంగ్లా అక్టోబర్, 21,(నంది పత్రిక):** జూపాడుబంగ్లా మండల జిల్లా ప్రాదేశిక సభ్యురాలిగా మాధవరం శాంతి కుమారి మంగళవారం నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. మండల జడ్పీటిసి స్థానం ఎస్సీ మహిళకు కేటాయించడంతో మండలంలోని పారుమంచాల గ్రామానికి చెందిన మాధవరం శాంతి కుమారుని టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి,నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్యలు శాంతి కుమారి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో మంగళవారం జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణ అధికారికి నంద్యాలలో నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. మాధవరం కుటుంబం రాజకీయంగా మండలంలో మంచి పేరున్న కుటుంబం కావడంతో మాధవరం శాంతి కుమారి అభ్యర్థిని ఖరారు చేయడం జరిగింది. గతంలో శాంతి కుమారి మామ మాధవరం ప్రకాశం పారుమంచాల గ్రామ సర్పంచ్ గా పనిచేసే మండలంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో మంచి సంబంధాలు కలిగి ఉన్న రు. రైతు కుటుంబం నుండి ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవ సహాయం తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు తుంగభద్రా దుర్గా ఘాట్‌లో వైభవంగా అమ్మవారి నిమజ్జనోత్సవాలు ప్రారంభం

### మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ రాష్ట్ర మంత్రివర్యులు టి జి భరత్

**కర్నూల్ సిటీ నంది పత్రిక** దక్షిణ భారతదేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందేలా కర్నూలు నగరంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని సంకల్‌బాగ్ సమీపంలో తుంగభద్రా నది తీరాన ఏర్పాటు చేసిన దుర్గా ఘాట్‌లో దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్‌తో కలిసి మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి, అనంతరం రావణ వధ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత గంగా హారతి నిర్వహించి, అమ్మవారి తొలి విగ్రహాన్ని నిమజ్జనం చేసి నిమజ్జన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. తొలుత ఒకే విగ్రహంతో ప్రారంభమైన దుర్గామాత ఉత్సవాలు నేడు నగరవ్యాప్తంగా అనేక విగ్రహాల ఏర్పాటుతో ఘనంగా జరుగుతున్నాయని తెలిపారు. భక్తుల భాగస్వామ్యం, ప్రజల ఆదరణతో కర్నూలులో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఏటా మరింత వైభవాన్ని సంతరించుకుంటున్నాయని చెప్పారు. గీతా ప్రచార సంఘం, విశ్వహిందూ పరిషత్, టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ టీజీవీ గ్రూప్ తరపున ప్రతి సంవత్సరం ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ తెలిపారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాల సమ్మేళనంగా కర్నూలు నగరంలో దుర్గా నిమజ్జన మహోత్సవం నిర్వహిస్తున్నామ్ అన్నారు. దక్షిణ భారత దేశంలో ఎక్కడా లేనివిధంగా 25 సంవత్సరాల క్రితం కర్నూల్ నగరంలో తొలిసారిగా దుర్గా మాత నవరాత్రుల కార్యక్రమాలను మొదలుపెట్టామన్నారు. పది రోజులపాటు నియమ నిష్టలతో సాంప్రదాయ బద్దంగా పూజల నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టామని టీజీ వెంకటేష్ తెలిపారు. మొదట్లో ఐదు పది విగ్రహాలతో ప్రారంభమైన దుర్గా మాత ఉత్సవాలు ప్రతి సంవత్సరము పెరుగుతో ఇప్పుడు 250 కి పైగా విగ్రహాలు నగరంలో ఏర్పాటు చేశారన్నారు. నగరంలోని ప్రజలందరూ భక్తి భావనలతో దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేసుకొని కుటుంబ సమేతంగా పూజల నిర్వహించడమే కాకుండా, నిమజ్జన కార్యక్రమానికి సహకరించడం అభినందించదగ్గ విషయం అన్నారు. రాష్ట్రంలో నవరాత్రి ఉత్సవాలు విజయవాడ తర్వాత కర్నూలు బాగా జరుగుతుందన్న పేరు నగరానికి వచ్చిందన్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు జరుపుకున్న నగర ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నట్టు టీజీ వెంకటేష్ తెలిపారు. నిమజ్జన మహోత్సవం సజావుగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థి విజయ ప్రత్యూష, టీజీ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## అందరికీ అందుబాటులో ఉంటాను ఆదరించండి

### 36వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థిగా బి ఫాం అందుకున్న వి శైలజ యాదవ్

**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూల్ కార్పొరేషన్ పరిధిలోని 36వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థిగా టిడిపి నుంచి పోటీ చేస్తున్నానని అందరికీ అందుబాటులో ఉంటూ సేవలంది స్తానని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థి వి శైలజ యాదవ్ ఫోటోలలో కోరారు బుధవారం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి చేతులమీదుగా వి శైలజ యాదవ్ బి ఫారం అందుకున్నారు. అనంతరం వార్డులో విస్తృతంగా ఇంటింటి ప్రచారం చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళుగా ప్రజా సేవలో ముందుకు సాగుతుందన్నారు ఇక్కడ కూడా కర్నూలు మేయర్గా విజయ ప్రత్యూషను 36వ వార్డు కార్పొరేటర్ గా తనను అధిక మెజార్టీతో గెలిపించాలని త్రిబుల్ ఇంజన్ సర్కార్తో అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి, వార్డు నాయకులు గుణంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మల్లి, పుల్లయ్య, యేసు తదితరులు పాల్గొన్నారు



## చూపు లేకున్నా ఫొటోగ్రఫీ.. ఐఐటీ మద్రాస్‌లో అద్భుత ప్రయోగం!

ఒక గదిలో ఇద్దరు మాట్లాడుతున్నారు. మైక్రోఫోన్ ఆన్‌లో ఉంది. ఏసీ శబ్దం వినిపిస్తోంది. చాలామందికి ఇవన్నీ సాధారణమైన శబ్దాలే. కానీ చూపులేని వ్యక్తికి ఇవే ఒక ఫొటోకు తొలి మెట్లు కావచ్చు! వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. వినికిడి, స్పర్శ సాయంతో ఫొటోగ్రఫీ నేర్చుకుంటున్నారు కొందరు దృష్టిలోపం ఉన్నవారు. ఐఐటీ మద్రాస్‌లో ఈ వినూత్న కళకు శిక్షణ ఇస్తున్నారు.

**శబ్దాల ఆధారంగా ఫొటో ఫ్రేమ్** ఐఐటీ మద్రాస్‌లోని హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ హేమచంద్రన్ కరాహ్ ఈ విధానాన్ని వివరిస్తున్నారు. ఆయన యాక్సెసిబిలిటీ రీసెర్చ్ సెంటర్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. దివ్యాంగులకు విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావడంపై ఈ కేంద్రం పరిశోధనలు చేస్తోంది. 2025 అక్టోబర్ 6న మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.

చూపులేని వ్యక్తి ఫొటో తీయాలంటే ముందుగా ఆ ప్రదేశాన్ని శబ్దాల ద్వారా అర్థం చేసుకోవాలి. ఎవరు ఎక్కడ కూర్చున్నారు? ఎవరు ఏ వైపు నుంచి వస్తున్నారు? ఎక్కడి నుంచి మాటలు వినిపిస్తున్నాయి? వంటి విషయాలను గుర్తించాలి. అవసరమైనప్పుడు స్పర్శ సాయమూ తీసుకోవాలి. ఇలా మనసులో ఆ ప్రదేశం గురించి ఒక రూపాన్ని ఏర్పరచుకున్న తర్వాత కెమెరాతో ఫొటో తీస్తారు. తీసిన ఫొటోను ఏఐ సాధనం లేదా సహోద్యోగి సాయంతో పరిశీలించి, అవసరమైతే మరోసారి ప్రయత్నిస్తారు. మంచి ఫొటో కోసం మూడు నాలుగు చిత్రాలు తీసే సందర్భాలూ ఉంటాయి.

# నామినేషన్ల ప్రక్రియలో అడ్డంకులు సృష్టించారంటూ ఆరోపణలు : బుగ్గన



**డోన్ నంది పత్రిక, అక్టోబర్ 21:** డోన్ పట్టణం వై సీ పి కార్యాలయం లో జరిగిన విలేకరుల సమావేశం లోడోన్, బేతంచెర్ల మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో నామినేషన్ల దాఖలు, పరిశీలన (స్క్రూటినీ), బీ–ఫారాల సమర్పణ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో డోన్ మున్సిపల్ ఎన్నికలపై రాజకీయ విమర్శలు తీవ్రతరం అవుతున్నాయి. మున్సిపల్ చైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేసిన కోట్ల సుజాతమ్మ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్య విలువలు పాటించామని చెబుతున్న కూటమి నాయకులు, ప్రతిపక్ష అభ్యర్థులకు ఎదురైన ఇబ్బందులపై సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఇటీవల కోట్ల సుజాతమ్మ మున్సిపల్ చైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతుల గురించి చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ నేతలు స్పందించారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని చెబుతున్న నాయకులు, నామినేషన్ల సమయంలో అభ్యర్థులు ఎదుర్కొన్న ఇబ్బందులపై కూడా అదే స్థాయిలో స్పందించాలని వారు పేర్కొన్నారు.

**అధికార దుర్వినియోగం జరిగిందా?**

నామినేషన్ల ప్రక్రియలో కొందరు అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురయ్యాయని, అవసరమైన ధ్రువపత్రాల జారీ విషయంలో జాప్యం జరిగిందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేశారనే విమర్శలు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు సమాన అవకాశాలు ఉండాలని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాలని వారు పేర్కొన్నారు. ఒకవైపు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడుతూనే, మరోవైపు అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురైతే వాటికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

**ప్రతిపక్ష అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించాలి**

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు అవసరమైన పత్రాలను సకాలంలో అందించి, నిబంధనల ప్రకారం నామినేషన్లు దాఖలు చేసుకునే అవకాశం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరగడం అత్యంత ముఖ్యమని, ప్రతి అభ్యర్థి హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. నామినేషన్ల ప్రక్రియలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదురవుతున్న పరిణామాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. డోన్ వై సీ పి చైర్మన్ అభ్యర్థి గా వల్లేపు బోయ చైతన్య ను బుగ్గన బుధవారం విలేకరుల సమావేశం లో ప్రకటించారు. డోన్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చి, అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని రాజకీయ వర్గాలు కోరుతున్నాయి.



## టీడీపీలోకి వైసీపీ ప్రస్తుత 53 వ కార్పొరేటర్ ఇమ్రాన్‌అభ్యర్థి

**టీడీపీ53 వ వార్డ్ అభ్యర్తి కురువ చంద్రశేఖర్ ఏకగ్రీవం**

**500 మంది వైసీపీ కార్యకర్తల టిడీపీ లో చేరిక**

**కే డి సి సి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సమక్షంలో టీడీపీలో చేరిన ఇమ్రాన్, వైసీపీ మాజీ కార్పొరేటర్ సాంబ అనుచరులు కర్నూలు కార్పొరేషన్ పరిధిలో తెలుగుదేశం పార్టీకి మరింత బలం చేకూరింది. కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి , కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సమక్షంలో 53వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి ఇమ్రాన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. అదేవిధంగా, వైసీపీ మాజీ కార్పొరేటర్ సాంబ ఆధ్వర్యంలో సుమారు 500 మంది టీడీపీ పార్టీలో చేరారు. కూటమి ప్రభుత్వ పాలన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంపై విశ్వాసంతో టీడీపీలో చేరినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా 53వ వార్డు టీడీపీ అభ్యర్థి కురువ చంద్రశేఖర్ ని అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేస్తామని నాయకులు పేర్కొన్నారు .టీడీపీ కుటుంబంలోకి భారీగా చేరికలతో కర్నూలు కార్పొరేషన్ పరిధిలో పార్టీ మరింత బలోపేతమవుతోందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీమోన్, బిరు ప్రతాపరెడ్డి, మనోజ్ పాల్గొన్నారు.



## వైసీపీ నాయకుల అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే

**నామినేషన్లు వేసేందుకు వైసిపి నాయకులకు రక్షణ కల్పించాలన్న మాజీ ఎమ్మెల్యే**



**బనగానపల్లె అక్టోబర్ 21 నంది పత్రిక** వైఎస్సార్ సిపి నేతల అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ అభ్యర్థులను అక్రమంగా నిర్బంధించి నామినేషన్లు వేసేందుకు కూడా వీలు లేకుండా టిడిపి ప్రభుత్వం ఇక్కడి మంత్రి జనార్దన్ రెడ్డి కుట్రపూరితంగా వైఎస్ఆర్సిపి నాయకులను అక్రమంగా పోలీసులచే నిర్బంధించారని ఇది రెడ్ బుక్కు రాజ్యాంగం అమలులో భాగంగానే జరుగుతుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటరు స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకునే హక్కు ఉందని అయితే ఈ ప్రభుత్వము ఆ హక్కులను కాలరాస్తూ నియంత ధోరణితో గెలుపొందాలని మా పార్టీ నాయకులందరినీ పోలీసులతో నిర్బంధిస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు . మా పార్టీకి చెందిన అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు అధికార పార్టీ సూచన మేరకు నడుచుకుంటున్నారని ఎన్నిక ప్రజాస్వామ్య బద్దంగా జరిగే ఎన్నికలకు కావని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగితే వైసీపీ పార్టీ ఖచ్చితంగా గెలుస్తుంది అనే ఉద్దేశ్యంతో నామినేషన్ లు వేయకుండా పోలీసులతో మంత్రి బిసి అడ్డుకుంటున్నారని అన్నారు . నిరసన కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబుల్ రెడ్డి గ వైఎస్సార్సీపీ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి అవుకు మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి , వైఎస్ఆర్సిపి రాష్ట్ర మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి అత్తర్ జాహీద్ హుస్సేన్ వైఎస్ఆర్సిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి అబ్దుల్ ఖైర్ , జిల్లా వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి , వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి అంబటి రవి కుమార్ రెడ్డి బనగానపల్లె మండల వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆత్మకూరు మున్సిపాలిటీ టిడిపి చైర్మన్ అభ్యర్థి ఏకగ్రీవం



**నంది పత్రిక ఆత్మకూరు** ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ గోవిందరాజులు నాకు సహకరించి విజయానికి కారకులైన ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి మరియు టిడిపి నాయకులు ఆత్మకూరు మున్సిపాలిటీ నాయకులు కార్యకర్తలు ప్రజలకు హృదయపూర్వక అభినందనలు మరియు ప్రజల విశ్వాసం తో ఈ గౌరవప్రదమైన బాధ్యతను చేపట్టిన నాకు, ఆత్మకూరు పట్టణ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి, మౌలిక సదుపాయాల మెరుగుదలకు అంకితభావంతో కృషి చేస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆదర్శవంతమైన పాలన అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. నా నాయకత్వంలో ఆత్మకూరు పట్టణం అభివృద్ధి పథంలో మరిన్ని విజయాలు చేసి , అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యంతొ ప్రయాణం విజయవంతంగా కొనసాగిస్తానని మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్గా ప్రజలు నాయకులు, కార్యకర్తలు ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు



## అమ్మవారి శాలలో డోన్ ఎంఎల్ఏ కోట్ల ప్రత్యేక పూజలు



**బేతంచెర్ల అక్టోబర్ 21 ( నంది పత్రిక ).** బేతంచర్ల పట్టణంలోని అమ్మవారి శాల ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, టిడిపి యువ నాయకురాలు కోట్ల చిత్రమ్మ, బేతంచర్ల నగర పంచాయతీ కూటమి చైర్మన్ అభ్యర్థి లోకేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయం( అమ్మవారి శాల) నందు అమ్మ వారి ఆశీస్సులతో గత రెండేళ్లుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేశానని తెలిపారు. పట్టణ ప్రజలకు, వ్యాపారస్తులకు ఎలాంటి సమస్యలు ఉన్నా, తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని కోరారు. బేతంచర్ల పట్టణంలోని దాదాపు ప్రతి వీధిలో సిమెంట్ రోడ్ల నిర్మాణం, తాగునీటి సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. బేతంచర్ల పట్టణం మరింత అభివృద్ధి చెందాలన్నా, ప్రజలు మరియు వ్యాపారస్తులు సంతోషంగా ఉండాలన్నా, కూటమి పాలన కొనసాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి చైర్మన్ అభ్యర్థి లోకేష్ గౌడ్ తో పాటు కూటమి కౌన్సిలర్ అభ్యర్థులకు ప్రజలు మరోసారి మద్దతు తెలిపి ఆశీర్వదించాలని కోరారు.

## ఎంపిటిసి అభ్యర్థిగా శీలం గీతావాణి నామినేషన్



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 21 నంది పత్రిక** ఆర్లగడ్డ మండలం బాచుపల్లి గ్రామానికి చెందిన శీలం గీతావాణి, పాత కందుకూరు ఎంపీటీసీ అభ్యర్థిగా బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈమెను టిడిపి తరఫున మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలుగా ఎన్నుకోవడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మండల కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి, మర్రిపల్లె టిడిపి నాయకులు పాపిరెడ్డి పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా టీడీపీ అభ్యర్థి అనిషా ఏకగ్రీవం





**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 21, నంది పత్రిక** ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో తెలుగుదేశం పార్టీకి చెందిన అభ్యర్థి షేక్ అనిషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి షరీఫా బీ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో టీడీపీ అభ్యర్థి అనిషా ఏకగ్రీవ ఎన్నికకు మార్గం సుగమమైంది. అలాగే ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులు ఉండగా, వాటిలో తెలుగుదేశం పార్టీకి 22 వార్డులు, 2 3 5 7 10 11 13 14 15 16 17 18 19 20 21 24 25 27 28 30 31 32 ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 8 వార్డులు, 4 6 8 9 12 23 26 29 ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు అలాగే జనసేనకు పార్టీకి 1,22 వార్డులు దక్కినట్లు ఎన్నికల అధికారి పి కిషోర్ వెల్లడించారు. అభ్యర్థుల నామినేషన్ ఘట్టంలో, స్క్రుట్నీ లో, విత్ డ్రా ఘట్టంలో, ఎన్నికల నిబంధనలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఆయన తెలిపారు.

## హైదరాబాద్-విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలు:

దసరా పండుగ సెలవులు ముగియడంతో నగరవాసులు తిరుగు ప్రయాణం పట్టారు. దీంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–65) వాహనాలతో కిక్కిరిసిపోయింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరడంతో టోల్‌గేట్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ముఖ్యంగా హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో వాహనాలు బారులు తీరాయి. కొన్ని సమయాల్లో అర కిలోమీటరు వరకు వాహనాలు నిలిచిపోయాయి. రద్దీని తగ్గించేందుకు అధికారులు హైదరాబాద్ వైపు ఉన్న 18 టోల్ బూత్‌లకు గాను 12 తెరిచి వాహనాలను పంపించారు. ఫాస్టాగ్ విధానం అమలులో ఉన్నప్పటికీ, వాహనాల తాకిడి అధికంగా ఉండటంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. దీనికి తోడు, చిట్యాల, చౌటుప్పల్ వద్ద జరుగుతున్న అండర్‌పాస్, వంతెన నిర్మాణ పనులు కూడా వాహనాల రాకపోకల వేగానికి అడ్డంకిగా మారాయి.

## వైభవంగా ఎగువ అహోబిలంలో పవిత్రోత్సవ అంకురార్పణం



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 21, నంది పత్రిక** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం అంకురార్పణం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, సంప్రదాయబద్ధమైన వైదిక క్రతువుల నడుమ అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పవిత్రోత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని, లోకకల్యాణం, సకల జనుల శ్రేయస్సు కలగాలని స్వామివారిని ప్రార్థిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:- APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# అమరుల త్యాగానికి సలాం, పాలకుల బాధ్యతకు నిలదీత

**బొల్లు రామమోహన్.**

**కడప అక్టోబర్ 21 (నంది పత్రిక రిపోర్టర్)**అమరం.. అమరం.. మీ జీవితం అమరం! జాతి మరువదు మీ త్యాగం!ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలిచి, సమాజ భద్రత కోసం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించిన పోలీసు అమరవీరులకు అక్షరాంజలి ఘటించడం ప్రతి పౌరుడి కనీస బాధ్యత. అయితే, అమరవీరుల సంస్మరణ దినోత్సవం అంటే పూలమాలలు వేయడం, నివాళులు అర్పించడం, ఉపన్యాసాలు దంచడం, వారి సేవలను ఆకాశానికెత్తడం మాత్రమేనా? వారి త్యాగాలను కొనియాడే పాలకులు, వారి కుటుంబాల కన్నీళ్లను తుడిచే బాధ్యతను కూడా అంతే చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. దేశ రక్షణలో సరిహద్దుల వద్ద సైనికులు ఎంత కీలకమో, అంతర్గత భద్రతలో పోలీసులు అంతే కీలకం. ఉగ్రవాదం, మతోన్మాదం, మాదకద్రవ్యాల మాఫియా, సంఘవిద్రోహ శక్తులు, వ్యవస్థీకృత నేరాలపై పోరాటంలో పోలీసులు ముందువరుసలో ఉంటారు. పగలూ రాత్రీ తేడా లేకుండా, పండుగలకూ కుటుంబ వేడుకలకూ దూరంగా ఉంటూ ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమిస్తారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ప్రమాదాలను లెక్కచేయకుండా ముందడుగు వేస్తారు. ఈ క్రమంలో ప్రాణాలు కోల్పోయిన వారి త్యాగం కేవలం ఒక కుటుంబానికి తీరని లోటు మాత్రమే కాదు.. జాతి మొత్తానికి తీరని నష్టం. లడఖ్ మంచుకొండలైనా, అటవీ ప్రాంతాలైనా, మారుమూల గ్రామాలైనా, మహానగరాల రద్దీ వీధులైనా.. విధి పిలుపు వినిపించినప్పుడు వెనుకడుగు వేయని ధైర్యమే పోలీసుల అసలైన బలం. కర్తవ్యాన్ని దైవంగా భావించి, ప్రజల భద్రతను జీవిత ధ్యేయంగా స్వీకరించే వారి సంకల్పం దేశానికి వరం. కుటుంబానికి దూరంగా గడిపే ప్రతి క్షణం వెనుక ఒక తల్లి నిరీక్షణ, ఒక భార్య ఆందోళన, పిల్లల ఎదురుచూపులు ఉంటాయి. విధి కోసం బయలుదేరిన వ్యక్తి తిరిగి వస్తాడో లేదో తెలియని అనిశ్చితి మధ్య జీవించే ఆ కుటుంబాల వేదనను మాటల్లో పూర్తిగా వర్ణించలేం.

**అమరుడి మరణం ఒక వార్త కావచ్చు.. కానీ అతడి కుటుంబానికి అది జీవితాంతం మానని గాయం!**

మాదకద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తును కబళిస్తున్న వేళ, దాని వెనుక ఉన్న అక్రమ నెట్‌వర్క్‌లను ఛేదించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. ఉగ్రవాదం, మతోన్మాదం, నేర రాజకీయాలు, అవినీతి, అధికార దుర్వినియోగం వంటి సవాళ్లను ఎదుర్కొంటూ చట్టబద్ధమైన పాలనను కాపాడాలి. ఈ పోరాటంలో నిజాయితీ, నిష్పక్షపాత వైఖరి, వృత్తిపరమైన నిబద్ధత కీలకం. పదవులు, పలుకుబడి, రాజకీయ ఒత్తిళ్లు, బంధుప్రీతి ముందు చట్టం తలవంచకూడదు. నేరస్థుడి స్థాయి ఎంతటిదైనా చట్టం ముందు సమానత్వం నిలవాలి.అయితే, పోలీసు వ్యవస్థను కీర్తించడం ఎంత అవసరమో, దానిలోని లోపాలను సరిదిద్దడం కూడా అంతే అవసరం. విధి నిర్వహణకు సరిపడా సిబ్బంది, ఆధునిక పరికరాలు, సమర్థవంతమైన శిక్షణ, ఆరోగ్య సంరక్షణ, విశ్రాంతి, మానసిక ఒత్తిడిని ఎదుర్కొనే సహాయక వ్యవస్థలు కల్పించకుండా కేవలం త్యాగాలను ఆశించడం న్యాయం కాదు. ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసే సిబ్బందికి భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు తమ బాధ్యతను విస్మరించకూడదు. అమరవీరుల త్యాగాలను గౌరవించే పాలన, విధుల్లో ఉన్న పోలీసుల ప్రాణాలనూ అంతే విలువైనవిగా చూడాలి.ఇక అమరవీరుల కుటుంబాల పరిస్థితి మరింత హృదయవిదారకం. ఒక కుటుంబానికి ఆధారమైన వ్యక్తి దేశం కోసం ప్రాణాలు కోల్పోయినప్పుడు, ఆ కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా ఎదుర్కొనే సవాళ్లను ప్రభుత్వం గుర్తించాలి. ప్రకటించిన పరిహారం సకాలంలో అందుతోందా? పిల్లల విద్యకు అవసరమైన తోడ్పాటు లభిస్తోందా? కుటుంబ సభ్యులకు అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు చేరుతున్నాయా? వారి సమస్యలను పరిష్కరించేందుకు బాధ్యతాయుతమైన వ్యవస్థ ఉందా? ఇలాంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. అమరుల పేరుతో సభలు నిర్వహించడం కంటే, వారి కుటుంబాలకు న్యాయం అందించడం గొప్ప నివాళి.

**కన్నీటి సంద్రంలో మునిగిన అమరుల కుటుంబాలను ఓదార్చడం మాత్రమే కాదు.. వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలి.**ప్రభుత్వాలు అమరవీరుల త్యాగాలను ప్రసంగాల్లో మాత్రమే పరిమితం చేయకూడదు. సంక్షేమ హామీల అమలుపై పారదర్శకత ఉండాలి. పరిహారం, పెన్షన్, విద్యా సహాయం, ఇతర ప్రయోజనాల విషయంలో జాప్యం జరగకుండా పర్యవేక్షణ ఉండాలి. కుటుంబ సభ్యులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదు. త్యాగానికి ప్రతిఫలం చెల్లించలేం; కానీ ఆ త్యాగం చేసిన కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయకుండా చూడగలం. అదే నిజమైన మానవత్వం. అదే బాధ్యతాయుత పాలన. ప్రజలకు కూడా ఇందులో బాధ్యత ఉంది. చట్టాలను గౌరవించడం, నేరాలపై అప్రమత్తంగా ఉండటం, మాదకద్రవ్యాల వ్యాప్తిని అడ్డుకునేందుకు సహకరించడం, మహిళలు మరియు పిల్లల భద్రతకు తోడ్పడటం, పోలీసులకు విశ్వసనీయ సమాచారాన్ని అందించడం ద్వారా సమాజ భద్రతలో భాగస్వాములు కావాలి. అదే సమయంలో పోలీసులు ప్రజల హక్కులను గౌరవిస్తూ, చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించేలా ప్రజాస్వామ్య పర్యవేక్షణ కూడా కొనసాగాలి. ప్రజల సహకారం, పోలీసుల వృత్తి నిబద్ధత, ప్రభుత్వాల జవాబుదారీతనం కలిసినప్పుడే సురక్షిత సమాజం




సాధ్యమవుతుంది.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఒక ఆచార కార్యక్రమం కాదు. అది త్యాగాన్ని గుర్తుచేసే సందర్భం మాత్రమే కాదు.. వ్యవస్థ తన బాధ్యతను సమీక్షించుకునే సందర్భం. అమరుల స్ఫూర్తిని కేవలం నినాదాల్లో కాకుండా నిజాయితీతో కూడిన పాలనలో, న్యాయబద్ధమైన పోలీసు వ్యవస్థలో, సంక్షేమం పొందుతున్న వారి కుటుంబాల్లో చూడగలగాలి.సమరాలు, త్యాగాలే వారి జీవిత పయనం. వారి ధైర్యమే సమాజానికి స్ఫూర్తిపథం. వారి సేవలకు జాతి రుణపడి ఉంటుంది. ఆ రుణాన్ని మాటలతో తీర్చలేం. వారి ఆశయాలను గౌరవించడం ద్వారా, వారి కుటుంబాలకు న్యాయం చేయడం ద్వారా, విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు తగిన భద్రత కల్పించడం ద్వారా మాత్రమే కొంతైనా కృతజ్ఞత చాటగలం.

ఒక్కరోజు కాదు.. ప్రతి రోజూ అమరుల స్మరణ ఉండాలి.

ఒక్క నివాళి కాదు.. వారి కుటుంబాలకు నిరంతర భరోసా ఉండాలి.ఒక్క నినాదం కాదు.. ప్రభుత్వాల చర్యల్లో బాధ్యత కనిపించాలి. అమరుల త్యాగానికి శతకోటి వందనాలు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన ప్రతి పోలీసు అమరవీరుడికి జాతి యావత్తు లాల్ సలాం అర్పిస్తోంది. వారి త్యాగం అజరామరం కావాలి. వారి కుటుంబాలకు న్యాయం జరగాలి. వారి స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకం కావాలి.

అమరం.. అమరం.. మీ జీవితం అమరం!
జాతి మరువదు మీ త్యాగం!
ఓ జాతి రక్షకులారా.. అందుకోండి మా లాల్ సలాం!

## బ్రాహ్మణులకు కో-ఆప్షన్ పదవులు ఇవ్వాలి

**రాష్ట్ర బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు**



**కడప అక్టోబర్ 21 (నంది పత్రిక రిపోర్టర్)** రాష్ట్రంలో బ్రాహ్మణులు రాజకీయ మైనార్టీలుగా మిగిలిపోయారని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు పీవీఎస్ వీ ప్రసాదరావు, సూగూరు రఘునాథరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రాహ్మణులకు అనేక హామీలను అమలు చేసిందని, అయితే రాజకీయంగా అవకాశాలు కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. పై స్థాయిలో అర్హత ఉన్నవారిని ఎంపిక చేయమని చెప్పినా, జిల్లా స్థాయిలో నాయకులు అవకాశం కల్పించ కపోవడం బాధాకర మన్నారు.రాష్ట్రంలో పలు చోట్ల పోటీ చేయడానికి బ్రాహ్మణులు ఆసక్తి చూపినా, కింద స్థాయి నాయకులు కనీసం అడగకపోవడం, అవకాశం ఇవ్వకపోవడం జరిగిందని తెలిపారు. అన్ని కులాలకు రిజర్వేషన్ రూపంలో అవకాశం ఇచ్చారని, అయితే బ్రాహ్మణులకు వర్తింపజేయలేదన్నారు. పేరుకే అగ్రకులం తప్ప అన్నింటిలోనూ బ్రాహ్మ ణులు వెనుకబడి పోయారని, రాజకీయ మైనార్టీగా గుర్తించి అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మండలాల్లో కో-ఆప్షన్ పదవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను సూపర్ గా అమలు చేసిందని, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే కూటమి తరపున పోటీ చేస్తున్న మేయర్, చైర్మన్, కార్పొరేటర్, కౌన్సిలర్, ఎంపీపీ, ఎంపీటీసీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించడానికి జిల్లాలోని బ్రాహ్మణులు కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

## ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి మా విజయానికి కారణం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 21 నంది పత్రిక** ఆళ్లగడ్డ మున్సిపాలిటీని అధికార కూటమి దక్కించుకోవడం ప్రజా విజయమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు బుధవారం ఆళ్లగడ్డలో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అధికార కూటమి 24 వార్డులు వైకాపా 8 వార్డులు ఏకగ్రీవంగా దక్కించుకున్నాయి ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుండి ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు మేము చేసిన అభివృద్ధి మా విజయానికి కారణం అన్నారు 2024 ఎన్నికల్లో ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో 5000 మెజార్టీ దక్కడం జరిగిందన్నారు నాడు ప్రజలు ఇచ్చిన విజయాన్ని తాను బాధ్యతగా స్వీకరించానన్నారు మేము చేసిన అభివృద్ధితోనే మాకు ఈ విజయం దక్కడం జరిగిందన్నారు ఈ విజయంతో మాకు మరింత బాధ్యత పెరిగిందని ఆమె అన్నారు.

## 8వ వార్డులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జోరు!

**కర్నూలు జిల్లా అధ్యక్షులు యస్. వి మోహనరెడ్డి, మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, నగర అధ్యక్షులు అహ్మద్ అలీఖాన్**



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగరంలోని 8వ వార్డులో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఎస్.వి. మోహన్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పిఏసీ సభ్యులు, రాష్ట్ర మైనారిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఏ. హఫీజ్ ఖాన్ పాల్గొన్నారు.కర్నూలు నగర వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అహ్మద్ అలీ ఖాన్ పాల్గొన్నారు , ఈ సందర్భంగా 8వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థి నర్గీస్ అలీ కి, కర్నూలు నగర మేయర్ అభ్యర్థి యు. సుశీల కి ఫ్యాన్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

# నామినేషన్ ప్రక్రియను అడ్డుకునే అధికారం కూటమి నేతలకు ఎవరిచ్చారు

**ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్**

**కడప అక్టోబర్ 21 (నంది పత్రిక రిపోర్టర్)**జడ్పీటీసీ ఎన్నికల్లో తన నామినేషన్ పత్రాల పరిశీలన, అభ్యర్థిత్వాన్ని కొనసాగించే ప్రక్రియలో రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లకుండా అడ్డంకులు సృష్టించారని,అభ్యర్థి నామినేషన్ ప్రక్రియలో రాజకీయ నేతలు జోక్యం చేసుకొని అడ్డుకోవడానికి వారికి అధికారం ఎవరిచ్చారని ఆర్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్ ప్రశ్నించారుకడప జడ్పీ హాల్ వద్ద ఖాజీపేట జడ్పీటీసీ నామినేషన్ వేయడానికి వేళ్తుండగా డి.యం. ఓబులేసు యాదవ్ నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కొని కూటమి నేతలు చించివేసి రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారని ఇది కూటమి ప్రభుత్వ దుర్మార్గానికి పరాకాష్టన్నారు

**ఈ సందర్భంగా డి.యం. ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ**



స్థానిక సంస్థల ఎన్నికలను అధికార కూటమి ఏకపక్ష రాజకీయాలకు వేదికగా మార్చే ప్రయత్నం చేయడం సరికాదని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే నిర్ణేతలని, రాజకీయ నాయకులు కాదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి అర్హుడైన పౌరుడికి రాజ్యాంగబద్ధంగా లభించిన ప్రజాస్వామ్య హక్కు అని, ఆ హక్కుకు ఆటంకాలు కలగకుండా ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, పారదర్శకంగా సాగాలని అన్నారు. ఎన్నికల వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నాలను సహించేది లేదని ఓబులేసు యాదవ్ హెచ్చరించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థిత్వంపై నిర్ణయం వంటి ప్రక్రియలు ఎన్నికల నిబంధనల ప్రకారం సంబంధిత ఎన్నికల అధికారులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు.కాబట్టి, తన నామినేషన్‌కు సంబంధించిన పరిణామాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం న్యాయం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆయన డిమాండ్ చేశారు. జడ్పీటీసీ ఎన్నికలు ఎలాంటి రాజకీయ జోక్యానికి తావులేకుండా, నిష్పక్షపాతంగా జరిగేలా ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

"ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్ణేతలుడ రాజకీయ నేతలు కాదు. నామినేషన్ ప్రక్రియకు అడ్డంకులు సృష్టించడం ప్రజాస్వామ్య ఎన్నికలకు గొడ్డలిపెట్టు" అని డి.యం. ఓబులేసు యాదవ్ తెలిపారు

## ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి







**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 21 నంది పత్రిక** అత్తిలి మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్లను, అభ్యర్థులకు అందిస్తున్న సౌకర్యాలను ఆమె క్షేత్రస్థాయిలో సమీక్షించారు.ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన సహాయ కౌంటర్లను జిల్లా కలెక్టర్ పరిశీలించి, అభ్యర్థులకు అవసరమైన సమాచారం, సహకారం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా జరుగుతుందా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉంటూ, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారుల సమన్వయం కీలకమని పేర్కొంటూ, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ ఎం. సూర్యనారాయణ, రిటర్నింగ్ అధికారి యు. మంగపతి రావు, తహసీల్దార్ కె. పద్మావతి, ఎంపీడీఓ కె. అన్నపూర్ణేశ్వరి తదితర అధికారులు పాల్గొన్నారు.



## సింహాచలంలో వైభవంగా విజయదశమి వేడుకలు

**దుర్గాదేవికి గంట్ల శ్రీనుబాబు దంపతుల ప్రత్యేక పూజలు**

**విశాఖపట్నం బ్యూరో చీఫ్ అక్టోబర్ 21 నంది పత్రిక** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని సింహాచలంలో శ్రీ గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.విజయదశమి సందర్భంగా సంఘం అధ్యక్షులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు గంట్ల శ్రీనుబాబు తన సతీమణితో కలిసి దుర్గాదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు లోకంలో ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. శ్రీ గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటూ భక్తిపారవశ్యంలో మునిగితేలుతున్నారు. విజయదశమి పర్వదినం సందర్భంగా ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.



# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం....





## ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు వెలకట్టలేనివి:

### జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 21 నంది పత్రిక** దేశ రక్షణ, సమాజ శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం గొల్లలకోడేరులోని జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన స్మృతి పరేడ్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్, జిల్లా ఎస్పీలకు సాయుధ పోలీసు బలగాలు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం 2025 ఆగస్టు నుంచి 2026 ఆగస్టు వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల వివరాలతో కూడిన స్మారక పుస్తకాన్ని ఆర్ఎస్ఐ కె. గోపికృష్ణ జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. జాయింట్ కలెక్టర్ పుస్తకాన్ని ఆవిష్కరించి జిల్లా ఎస్పీకి అందజేయగా, అదనపు ఎస్పీ డి. విశ్వనాథ్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. అనంతరం జాయింట్ కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి, రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. బలిమెల దాడిలో వీరమరణం పొందిన పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పి. సుధీర్ బాబు కుటుంబ సభ్యులతో పాటు, గత ఏడాది కాలంలో జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ మరణించిన ఏఆర్ఎస్ఐ-1563 ఐకెడివి ప్రసాద్, ఏఆర్ పీసీ-2794 ఎన్. కన్నయ్య, హెచ్‌సీ-1879 డి. ఏడుకొండలు, పీసీ-1527 ఎస్.వి.వి.ఎస్. కృష్ణారావు, ఏఆర్ పీసీ-2759 జి. విజయకృష్ణ కుటుంబ సభ్యులను జాయింట్ కలెక్టర్, ఎస్పీ ప్రత్యేకంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ మాట్లాడుతూ, దేశ ప్రగతికి, రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణ మూలస్తంభమని, వాటిని కాపాడటంలో పోలీసుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో దేశ సరిహద్దుల రక్షణ కోసం చైనా బలగాలతో పోరాడుతూ ప్రాణాలర్పించిన సీఆర్‌పీఎఫ్ జవాన్ల త్యాగాలను పోలీసు అమరవీరుల సంస్మరణ దినం గుర్తు చేస్తుందన్నారు. విపత్తులు, ఎన్నికలు, శాంతిభద్రతల పరిరక్షణ వంటి క్లిష్ట పరిస్థితుల్లో పోలీసులు ధైర్యసాహసాలతో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలు పండుగలు, సంతోష సమయాల్లో కుటుంబాలతో గడుపుతున్నప్పటికీ, పోలీసులు సెలవులతో సంబంధం లేకుండా 24 గంటలూ ప్రజల రక్షణ కోసం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ, అంతర్గత భద్రతను కాపాడుతూ ఉగ్రవాదం, మావోయిజం, అసాంఘిక శక్తులను ఎదుర్కొనే క్రమంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలను దేశం ఎప్పటికీ మరువదన్నారు. గత ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 154 మంది పోలీసులు అమరులయ్యారని పేర్కొంటూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అమరవీరుల కుటుంబాలకు జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ డి. విశ్వనాథ్, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.వి.వి. సత్యనారాయణ, భీమవరం ఆర్డీఓ కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, భీమవరం సబ్ డివిజన్ డీఎస్పీ రఘువీర్ విష్ణు, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ డీఎస్పీ బి. నరసింహారావు, జిల్లా ప్రత్యేక విభాగం ఇన్‌స్పెక్టర్ కె.వి.వి.ఎన్. సత్యనారాయణ, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్. మోజేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.









# ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 21 నంది పత్రిక**

పాలకోడేరు మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్లను, అభ్యర్థులకు అందిస్తున్న సౌకర్యాలను ఆమె క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన సహాయ కౌంటర్లను జిల్లా కలెక్టర్ పరిశీలించి, అభ్యర్థులకు అవసరమైన సమాచారం, సహకారం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా జరుగుతుందా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉంటూ, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారుల సమన్వయం కీలకమని పేర్కొంటూ, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట రిటర్నింగ్ ఆఫీసర్ ఎన్ వి అరుణకుమారి, తహసిల్దార్ ఎన్ బి విజయలక్ష్మి, వి రెడ్డయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.




## ఎన్నికల పర్యవేక్షణకు జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 21 నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు భీమవరం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చదలవాడ నాగరాణి తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై పర్యవేక్షణ, సమన్వయం, సకాలంలో నివేదికల సమర్పణ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్‌ను సంప్రదించేందుకు 08816299181 నంబరును అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు నియమితులైన సిబ్బంది తమ బాధ్యతలను శ్రద్ధగా నిర్వహిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## జెడ్పీటీసీ నామినేషన్ల ప్రాథమిక పరిశీలనకు ఐదు ప్రత్యేక బృందాల ఏర్పాటు

### ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### : జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 21 నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లాలో జెడ్పీటీసీ సాధారణ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాల ప్రాథమిక పరిశీలనను ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చదలవాడ నాగరాణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జెడ్పీటీసీ సభ్యుల పదవులకు అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జిల్లా సంయుక్త కలెక్టర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. నామినేషన్ల ప్రాథమిక పరిశీలన కోసం ఐదుగురు బృందాధిపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా నరసాపురం డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారి బృందానికి అచంట, ఆకివీడు, అత్తిలి, భీమవరం జెడ్పీటీసీ స్థానాలను; తాడేపల్లిగూడెం డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారి బృందానికి యలమంచిలి, గణపవరం, ఇరగవరం, కాళ్ల జెడ్పీటీసీ స్థానాలను కేటాయించినట్లు వివరించారు. అలాగే జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బృందానికి మొగల్తూరు, నరసాపురం, పాలకొల్లు, పాలకోడేరు జెడ్పీటీసీ స్థానాలను; జిల్లా పర్యాటక అధికారి బృందానికి పెంటపాడు, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు జెడ్పీటీసీ స్థానాలను; జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బృందానికి తాడేపల్లిగూడెం, తణుకు, ఉండి, వీరవాసరం జెడ్పీటీసీ స్థానాల నామినేషన్ల పరిశీలన బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. ఈ ఐదు ప్రత్యేక బృందాల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా ఎస్‌జీఎస్‌డబ్ల్యూ అధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. బృంద సభ్యులంతా పర్యవేక్షణ అధికారితో సమన్వయం చేసుకుంటూ, నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు రిటర్నింగ్ అధికారికి పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా, ఆదేశాలను ఉల్లంఘించినా తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బంది ఎలాంటి ఆటంకాలు లేకుండా బాధ్యతలు నిర్వహించేలా వారిని తమ సాధారణ విధుల నుంచి తక్షణమే విధుల నుంచి విడుదల చేయాలని సంబంధిత కార్యాలయాల అధిపతులను ఆదేశించారు.

## జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

### తొలిరోజు ఆరు మండలాల్లో 10 నామినేషన్లు దాఖలు

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 21 నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అక్టోబర్ 21వ తేదీ సాయంత్రం 5 గంటల సమయానికి జిల్లాలోని 20 జడ్పీటీసీ స్థానాలకు గాను మొత్తం 10 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు. మండలాల వారీగా భీమవరం మండలంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఒక నామినేషన్, నరసాపురం మండలంలో స్వతంత్ర అభ్యర్థిగా ఒక నామినేషన్, పాలకోడేరు మండలంలో తెలుగుదేశం పార్టీ తరపున ఒక నామినేషన్, పెంటపాడు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఒక నామినేషన్ దాఖలయ్యాయి. అదేవిధంగా తాడేపల్లిగూడెం మండలంలో భారతీయ జనతా పార్టీ తరపున ఒకటి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మూడు నామినేషన్లు కలిపి మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. ఉండి మండలంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఒకటి, జనసేన పార్టీ తరపున ఒక నామినేషన్ చొప్పున మొత్తం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తంగా జిల్లాలో భారతీయ జనతా పార్టీ తరపున ఒకటి, కాంగ్రెస్ పార్టీ తరపున రెండు, జనసేన పార్టీ తరపున ఒకటి, తెలుగుదేశం పార్టీ తరపున ఒకటి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున నాలుగు, స్వతంత్ర అభ్యర్థిగా ఒక నామినేషన్ దాఖలైనట్లు నివేదికలో పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ వరకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## తెప్పోత్సవంలో నౌకా విహారం చేస్తూ సేదతీరిన శ్రీ వాసవంబ అమ్మవారు..

**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 21 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఆవరణలో బుధవారం రాత్రి అమ్మవారికి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తెప్పలో స్వర్ణాభరణాలతో కొలువు తీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10 రోజుల ఉత్సవాలలో అలసి, సొలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు తెప్పోత్సవంలో నౌకా విహారం చేస్తూ కాస్తంత సేద తీరారు. ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు. అనంతరం అమ్మవారికి పాన్పు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు, కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య మహిళలు భక్తులు పాల్గొన్నారు.



# అభిమానులకు క్షమాపణ చెప్పిన అమితాబ్.

బాలీవుడ్ లెజెండరీ నటుడు అమితాబ్ బచ్చన్ తన ఆరోగ్యంపై కీలక అప్డేట్ ఇచ్చారు. వైద్యుల సూచన మేరకు తాను కొన్ని రోజులు పూర్తి విశ్రాంతి తీసుకోబోతున్నట్టు వెల్లడించారు. ఈ కారణంగా సోషల్ మీడియాలో అభిమానులతో సంభాషించలేకపోతున్నందుకు క్షమాపణలు కోరారు.తన 'ఎక్స్' ఖాతా ద్వారా అమితాబ్ ఈ విషయాన్ని పంచుకున్నారు. "క్షమించండి.. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని కోలుకోవాలని డాక్టర్లు నాకు సలహా ఇచ్చారు. అందుకే ఏమీ రాయలేకపోతున్నాను..." అని ఆయన పోస్ట్ చేశారు. అంతకుముందు రోజు, దసరా శుభాకాంక్షలు తెలుపుతూ తన వ్యక్తిగత బ్లాగులో కూడా ఆయన ఇదే విధమైన సందేశాన్ని పంచుకున్నారు. "విశ్రాంతి, కోలుకునే ప్రక్రియలో ఉన్నందున కమ్యూనికేట్ చేయడానికి అనుమతి లేదు" అని అందులో పేర్కొన్నారు.అయితే, వైద్యులు ఎందుకు విశ్రాంతి సూచించారనే కచ్చితమైన కారణాన్ని అమితాబ్ వెల్లడించలేదు. కానీ, ఇటీవలే 'కౌన్ బనేగా కరోడ్‌పతి 18' షూటింగ్ సమయంలో తన మోకాలికి గాయమైనట్లు ఆయన చెప్పిన విషయం తెలిసిందే. ఈ నెల ప్రారంభంలో ప్రసారమైన ఓ ఎపిసోడ్‌లో, అంతకుముందు రోజు తాను జారిపడటంతో ఎడమ మోకాలికి గాయమైందని, అందుకే కూర్చునే తన ప్రారంభ ప్రసంగాన్ని ఇస్తున్నానని అమితాబ్ వివరించారు.ఈ నేపథ్యంలో ఆయనకు వైద్యులు విశ్రాంతిని సూచించి ఉంటారని భావిస్తున్నారు. అమితాబ్ పోస్ట్ చూసిన అభిమానులు, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సందేశాలు పంపుతున్నారు.




# 'లెనిన్ పాండియన్' ( అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!

విలేజ్ నేపథ్యంలోని కథలను .. క్రైమ్ డ్రామా నేపథ్యంలోని కథలను తెరకెక్కించడంలో తమిళ దర్శకులు సిద్ధహస్తులు. ఈ రెండిటినీ కలుపుకుని రూపొందిన సినిమాగా 'లెనిన్ పాండియన్' కనిపిస్తుంది. బాలచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, సెప్టెంబర్ 25వ తేదీన థియేటర్లకు వచ్చింది. గంగై అమరన్ – రోజా – దర్శన్ గణేశన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ప్రస్తుతం 'అమెజాన్ ప్రైమ్'లో అందుబాటులో ఉంది. 'శివగంగ' అనే ఒక విలేజ్ లో 'దురై రాజు' ( గంగై అమరన్) తన భార్య 'చందనం' (రోజా)తో కలిసి నివసిస్తూ ఉంటాడు. కొద్దిగా పొలం .. ఊరు చివరన ఒక చిన్న పాక .. ఇవే అతనికున్న ఆస్తులు. పిల్లలు లేని ఆ దంపతులు 'మీనాక్షి' అనే మేకను ఎంతో ప్రేమగా పెంచుకుంటూ ఉంటారు. ఆ ఊరు 'నది' నుంచి రాజారత్నం (ఆడుగాలం నరేన్) అతని కొడుకు 'రవి' (యుగేంద్రన్) అక్రమంగా ఇసుకను తరలిస్తూ ఉంటారు. రాజారత్నం నుంచి పెద్ద మొత్తంలో ముడుతున్నందువలన, రాజకీయనాయకులు .. పోలీస్ అధికారులు అతని గుప్పెట్లో ఉంటారు.ఒక రోజు ఒక ఇసుక లారీ ఢీ కొట్టడం వలన దురై రాజు మేక చనిపోతుంది. ఆ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోరు. దాంతో అతను ఇసుక మాఫియా విషయాన్ని వీఏవో (అర్చన రవిచంద్రన్) దృష్టికి తీసుకెళతాడు. వెంటనే యాక్షన్ తీసుకున్న ఆమెను, రాజారత్నం మనుషులు హత్య చేస్తారు. దాంతో దురైరాజు కోర్టుకు వెళతాడు. కోర్టు ఈ కేసును సీబీసీఐడీకి అప్పగిస్తుంది. దురైరాజుకి భద్రతగా సుందర పాండియన్ (దర్శన్ గణేశన్) అనే కానిస్టేబుల్ ను నియమిస్తుంది. సుందరపాండియన్ తండ్రి లెనిన్ పాండియన్ గతంలో కానిస్టేబుల్ గా పనిచేసి చనిపోతాడు. అతని మరణంపై అనేక ఊహాగానాలు ఉంటాయి. అతని స్థానంలో సుందరపాండియన్ కి పోలీస్ జాబ్ వస్తుంది. అయితే సానుభూతితో ఇచ్చిన ఆ జాబ్ చేయడం అతనికి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. అయితే ఆ జాబ్ చేయడం తమకి ఎంతో అవసరమని భార్య 'ప్రియ' చెబుతుంది. అతను ప్రియను ప్రేమించి పెళ్లి చేసుకోవడం వలన, ఆమె కుటుంబ సభ్యులు అతనిని టార్గెట్ చేసి ఉంటారు. వాళ్ల నుంచి తమని ఆ జాబ్ కాపాడుతుందని అంటుంది. సుందరపాండియన్ పిరికివాడనీ .. అతను ఆ జాబ్ కి పనికిరాడని తోటి ఆఫీసర్లు హేళన చేస్తుంటారు. అతణ్ణి డ్యూటీ చేయనీయకుండా చిల్లరపనులు చేయిస్తూ ఉంటారు. అతను ఒక అసమర్థుడని ప్రొజెక్ట్ చేస్తుంటారు. అలాంటి సుందరపాండియన్ దురై రాజుకి రక్షణ ఇవ్వగలుగుతాడా? తాను సమర్థుడైన పోలీస్ కానిస్టేబుల్ గా నిరూపించుకోగలుగుతాడా? అసలు అతని తండ్రి ఎలా చనిపోతాడు? ఇసుక మాఫియాకి సుందరపాండియన్ తెరదించగలుగుతాడా? అనేది మిగతా కథ. సుందరపాండియన్ అనే యువకుడు సున్నితమైన మనసున్నవాడు. పోలీస్ గా పనిచేస్తున్న తండ్రి చనిపోవడంతో, తన స్వభావానికి ఆ జాబ్ సెట్ కాదని తెలిసి కూడా, కుటుంబాన్ని నెట్టుకు రావడం కోసం పోలీస్ అవుతాడు. ఒక వైపున ఫ్యామిలీ వైపు నుంచి .. మరో వైపున స్వార్థ రాజకీయ నాయకుల నుంచి .. ఇంకొక వైపు నుంచి అవినీతి అధికారులు సృష్టించిన సమస్యలను ఒక సాధారణ పోలీస్ ఎలా ఎదుర్కొంటాడు? అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం.వయసు బాగా పైబడిన ఒక చిన్నపాటి రైతు, ఇసుక మాఫియాకి చెందిన వ్యక్తులతో తలపడటానికి సంబంధించిన సన్నివేశాలతో ఫస్టాఫ్ నడుస్తుంది. ఆ మాఫియా లీడర్ల నుంచి అతనికి రక్షణగా నియమించబడిన ఒక సాధారణ పోలీస్ కానిస్టేబుల్ ఎలాంటి సవాళ్లను ఫేస్ చేయవలసి వస్తుందనే సన్నివేశాలతో సెకండాఫ్ కొనసాగుతుంది. ఈ మధ్యలోనే పోలీస్ కి .. అతని భార్యకి., రైతుకు .. అతని భార్యకి గల ఎమోషన్స్ ను టచ్ చేస్తూ వెళ్లారు. అందంగా నదులు ప్రవహించే ఆహ్లాదకరమైన పల్లెలు ఇసుకాసురులు కబంధ హస్తాలలోకి వెళ్లిపోయాయి. అలాంటి ఇసుక మాఫియా ఒక సాధారణ రైతు .. ఒక సాధారణ పోలీస్ జీవితాలను ఎలా ప్రభావితం చేసిందనే అంశం చుట్టూ అల్లుకున్న ఈ కథ చాలా ఆసక్తికరంగా కొనసాగుతుంది. చాలా ప్రాంతాలలో అనునిత్యం కనిపిస్తున్న వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తుంది. అలాగే రైతులకు తమ నేలపై .. తాము పెంచుకుంటున్న జీవాలపై ఎంత అనురాగం ఉంటుందనేది ఆవిష్కరించిన తీరు కూడా గొప్పగా అనిపిస్తుంది. దర్శకుడు బలమైన కథనే ఎంచుకున్నాడు. దానిని సహజంగా ఆవిష్కరించడానికి తనవంతు ప్రయత్నం చేశాడు. అయితే వయసుపైబడిన వ్యక్తిని చందనం ఎందుకు పెళ్లి చేసుకుంది? అనే విషయానికి సంబంధించిన కారణం బలంగా కనిపించదు. అలాగే రోజా అనగానే రెబల్ పాత్రలకు కేరాఫ్ అడ్రెస్ గా చెప్పుకుంటారు. ఆ పాత్రలో ఆ వైపుకి సంబంధించిన యాంగిల్ ను చూపిస్తారేమోనని ఎదురుచూసిన ప్రేక్షకులకు నిరాశనే ఎదురవుతుంది. గంగై అమరన్ .. రోజా .. దర్శన్ గణేశన్ .. ఆడుకాలం నరేన్ .. ఇలా అంతా తమ పాత్రలకు న్యాయం చేశారు. ఎడ్విన్ సాకే ఫొటోగ్రఫీ .. ఇళయరాజా నేపథ్య సంగీతం ... రామచంద్రన్ ఎడిటింగ్ మంచి మార్కులు దక్కించుకుంటాయి. సహజత్వాన్ని ప్రతిబింబించే కథలు .. విలేజ్ నేపథ్యంలో నడిచే




కథలను ఇష్టపడేవారికి ఈ సినిమా నచ్చుతుందనే చెప్పాలి.

# 'రామాయణ'కు క్లీన్ 'యూ' సర్టిఫికెట్.. భారీ రన్‌టైమ్‌తో వస్తున్న చిత్రం!



దేశవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'రామాయణ'. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఒక ముఖ్యమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషో ప్రకారం, ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు క్లీన్ 'యూ' సర్టిఫికెట్ జారీ చేసింది. దీంతో ఎలాంటి వయోపరిమితి లేకుండా అందరూ ఈ చిత్రాన్ని థియేటర్లలో వీక్షించవచ్చు. బుక్‌మైషోలో పొందుపరిచిన వివరాల ప్రకారం.. 'రామాయణ' సినిమా నిడివి 3 గంటల 15 నిమిషాలుగా ఉంది. అయితే, ఈ సమాచారం ఇంకా 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్' (సీబీఎఫ్‌సీ) అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు కాలేదు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని, బుక్‌మైషోలో ఉన్న వివరాలే దాదాపుగా ఖరారయ్యే సూచనలు కనిపిస్తున్నాయని తెలుస్తోంది. ఇతిహాస గాథ అయిన రామాయణాన్ని వెండితెరపై ఆవిష్కరిస్తున్నందున, ఇంత భారీ రన్‌టైమ్ అవసరమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్, యశ్, సాయి పల్లవి ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ సంగీతం అందిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# బిష్ణోయ్ కమ్యూనిటీకి సల్మాన్ ఖాన్ క్షమాపణ చెప్పాలి.. అదే ఏకైక మార్గం: అనూప్ జలోటా

బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు, బిష్ణోయ్ కమ్యూనిటీకి మధ్య కొనసాగుతున్న వివాదానికి ముగింపు పలకాలంటే సల్మాన్ క్షమాపణ చెప్పడమే ఏకైక మార్గమని ప్రముఖ గాయకుడు, నటుడు అనూప్ జలోటా అన్నారు. ఇటీవల నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై జరిగిన కాల్పుల ఘటన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే సల్మాన్ క్షమాపణ చెప్పాలని ఆయన సూచించారు. అక్టోబర్ 18న ముంబైలోని జుహూ ప్రాంతంలో టైగర్ ష్రాఫ్ కారుపై జరిగిన కాల్పుల ఘటనపై అనూప్ జలోటా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "ఈ సంఘటన నన్ను చాలా బాధించింది. వీటన్నింటికీ ముగింపు పలకాలంటే ఒకే ఒక్క మార్గం ఉంది. సల్మాన్ ఖాన్ బిష్ణోయ్ సమాజానికి క్షమాపణ చెప్పాలి" అని ఆయన అన్నారు. తాను ఈ విషయాన్ని గతంలో కూడా చెప్పానని గుర్తుచేశారు. సల్మాన్ కారణంగా బిష్ణోయ్ కమ్యూనిటీ మనోభావాలు దెబ్బతిన్నాయని, క్షమాపణ చెప్పకపోతే వారు తమ బాధను ఇలాగే వ్యక్తం చేస్తూనే ఉంటారని జలోటా అభిప్రాయపడ్డారు. ఈ సమస్య పరిష్కారం కాకపోతే సల్మాన్‌తో కలిసి పనిచేసేవారు, వారి కుటుంబ సభ్యులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అందువల్ల, ఇప్పటికైనా సల్మాన్ ఖాన్ ఒక కఠిన నిర్ణయం తీసుకుని, ఈ వివాదానికి ముగింపు పలకాలని కోరారు. కాగా, టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసుకు సంబంధించి పోలీసులు ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు.



# బిజినెస్

# కొత్త పల్సర్ ఎన్250ఎస్ఎస్ వచ్చేసింది.. ధర రూ.1.59 లక్షలు, ఫీచర్లు అదుర్స్

బజాజ్ ఆటో భారత మార్కెట్లో కొత్త పల్సర్ ఎన్250ఎస్ఎస్ బైక్‌ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధరను రూ.1,59,406గా నిర్ణయించింది. ఇప్పటికే మార్కెట్లో ఉన్న పల్సర్ ఎన్250కి అప్‌డేటెడ్ వెర్షన్‌గా దీన్ని తీసుకొచ్చింది. ఇంజిన్, గేర్‌బాక్స్, డిస్‌ప్లే సహా పలు కీలక మార్పులు చేసింది. ముఖ్యంగా 6-స్పీడ్ గేర్‌బాక్స్, క్విక్‌షిఫ్టర్, 5 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్ వంటి ఫీచర్లు కొత్త బైక్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.డిజైన్ పరంగా పల్సర్ కుటుంబానికి చెందిన స్పోర్టీ రూపాన్ని కొనసాగించింది. బాడీపై పదునైన గీతలు, కొత్త పెయింట్ ఆప్షన్లు, తాజా గ్రాఫిక్స్ అందించారు. హెడ్‌ల్యాంప్ డిజైన్ మాత్రం సాధారణ ఎన్250 మోడల్‌కు దగ్గరగా ఉంది.ఇంజిన్ విషయానికి వస్తే.. ఇందులో 249 సీసీ ఎయిర్-కూల్డ్, ఆయిల్-కూల్డ్ ఇంజిన్‌ను అప్‌డేట్ చేశారు. నాలుగు వాల్వ్‌లతో పనిచేసే ఈ ఇంజిన్ 25 హెచ్‌పీ పవర్, 22 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సాధారణ ఎన్250లో 24.5 హెచ్‌పీ పవర్, 21.5 ఎన్ఎం టార్క్ లభిస్తాయి. అంటే కొత్త మోడల్‌లో స్వల్పంగా పవర్, టార్క్ పెరిగాయి. పాత 5-స్పీడ్ గేర్‌బాక్స్ స్థానంలో 6-స్పీడ్ గేర్‌బాక్స్‌ను ఇచ్చారు. క్లచ్ ఉపయోగించకుండా గేర్లు పెంచేందుకు వీలుగా స్పోర్ట్స్ షిఫ్టర్ ఫీచర్‌ను కూడా స్టాండర్డ్‌గా అందించారు. ఫీచర్ల పరంగా కొత్త బైక్‌లో ఎలక్ట్రానిక్ థ్రాటిల్ బాడీని ప్రవేశపెట్టారు. ఇది ఏబీఎస్ మోడ్‌లతో కలిసి రైడింగ్ మోడ్‌లకు మద్దతు ఇస్తుంది. అయితే, ఆయా మోడ్‌ల పూర్తి వివరాలను కంపెనీ వెల్లడించలేదు. పాత ఎల్‌సీడీ డిస్‌ప్లే స్థానంలో గూగుల్ మ్యాప్స్ మిర్రరింగ్ సదుపాయం ఉన్న 5 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్‌ను ఇచ్చారు. ఇందు లో ల్యాప్ టైమర్, వాహన పత్రాలను భద్రపరిచే సదుపాయం కూడా ఉంది. అడ్జస్టబుల్ లివర్లు, యూఎస్‌బీ టైప్-సీ ఛార్జింగ్ పోర్ట్, హాజార్డ్ స్విచ్, అకస్మాత్తుగా బ్రేకులు వేసినప్పుడు హెచ్చరించే పానిక్ బ్రేక్ అలర్ట్ ఫీచర్లను జోడించారు. సాధారణ పల్సర్ ఎన్250తో పోలిస్తే ఈ కొత్త మోడల్ ధర రూ.14,000 ఎక్కువ.



## ఎస్బీఐలో డేటా కలకలం.. డార్క్ వెబ్‌లో వేలమంది కస్టమర్ల కీలక సమాచారం.. ఖాతాదారులకు హెచ్చరిక!




దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)లో భారీ సైబర్ భద్రతా వైఫల్యం చోటుచేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు 3,900 మంది కస్టమర్లకు సంబంధించిన అత్యంత కీలకమైన వ్యక్తిగత సమాచారం డార్క్ వెబ్‌లో ప్రత్యక్షమైనట్లు బ్యాంకు గుర్తించింది. ఈ మేరకు బుధవారం స్టాక్ ఎక్స్ఛేం జ్‌కు ఎస్బీఐ అధికారికంగా సమాచారం అందించింది. ఈ ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించింది. లీకైన సమా చారంలో ఏముంది?ఈ నెల 16న తమకు థ్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రొవైడర్, డిఫెన్స్ సైబర్ ఏజెన్సీ, అలాగే ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ నుంచి హెచ్చరికలు అందినట్లు ఎస్బీఐ తెలిపింది. డార్క్ వెబ్‌లో లభ్యమైన సుమారు 3.75 లక్షల రికార్డులను ప్రాథమికంగా విశ్లేషించగా, వాటిలో 3,897 రికార్డులు తమ కస్టమర్లకు చెందినవిగా గుర్తించినట్లు పేర్కొంది. బహిర్గతమైన ఈ సమాచారంలో కస్టమర్ల పూర్తి పేర్లు, బ్యాంకులో రిజిస్టర్ అయిన మొబైల్ నంబర్లు, పుట్టిన తేదీ, లింగం, ఈమెయిల్ ఐడీలు, నివాస చిరునామాలు ఉన్నాయి. వీటితో పాటు బ్యాంకు బ్రాంచ్ వివరాలు, కస్టమర్ ఇన్ఫర్మేషన్ ఫైల్ (సీఐఎఫ్) ఐడెం టిఫైయర్లు, లోన్, లీడ్ రికార్డులకు సంబంధించిన మెటాడేటా వంటి అత్యంత సున్నితమైన వివరాలు కూడా ఉన్నట్లు బ్యాంకు తన ఫైలింగ్‌లో వివరించింది.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రహస్యాల లీక్..

దేశంలోనే అతిపెద్ద ప్రైవేటు బ్యాంకుల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో కీలక సమాచారం బయటకు వెళ్లినట్లు అంతర్గత విచారణలో వెల్లడైంది. బ్యాంకుకు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు వ్యాపార వ్యూహాలు, మార్కెట్‌పై ప్రభావం చూపగల సమాచారాన్ని బయటి వ్యక్తులకు చేరవేసినట్లు దర్యాప్తులో ఆధారాలు లభించాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారంపై విచారణ ఇంకా కొనసాగుతోంది. బ్యాంకులోని కొన్ని కీలక విభాగాలకు బాధ్యత వహిస్తున్న ఈ అధికారులపై అనుమానాలు రావడంతో అంతర్గత విచారణ ప్రారంభించారు. సమాచారం దుర్వినియోగమైందా? దాని వల్ల బ్యాంకుకు లేదా మార్కెట్‌కు ఏమైనా నష్టం జరిగిందా? అనే అంశాలపై పరిశీలిస్తున్నారు. విచారణలో గుర్తిం చిన విషయాలను ఉన్నతాధికారులతో పాటు బోర్డు లోని కొందరు సభ్యులకు ఈ ఏడాది ప్రారంభంలోనే తెలియజేసినట్లు సమాచారం. సంబంధిత అధికారులకు కూడా విచారణ వివరాలు అధికారికంగా తెలిపినట్లు తెలుస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధి అంతర్గత విచారణ జరుగుతున్న విషయాన్ని ధ్రువీకరించారు. అయితే, విచారణలో వెల్లడైన అంశాలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధి కారుల వివరాలపై స్పందించలేదు. విచారణ పూర్త య్యాక వెల్లడయ్యే అంశాల ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నైతిక విలువలు, పాలనా ప్రమాణాల విషయంలో రాజీ పడబోమని బ్యాంకు స్పష్టం చేసింది. ఈ పరిణామం బ్యాంకుకు కీలకమైన సమయంలో చోటుచేసుకుంది. ఈ నెల 27న అ నూప్ బాగ్చీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీఈఓగా బాధ్య తలు చేపట్టనున్నారు. ప్రత్యర్థి ఐసీఐసీఐ గ్రూపులో సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయనకు ఈ పరిణామాలు సవాలుగా మారే అవకాశముంది. ఇటీవల బ్యాంకులో ఉన్నతస్థాయి మార్పులు కూడా చోటుచేసుకున్నాయి. మార్చిలో అప్పటి ఛైర్మన్ చక్రవర్తి వ్యక్తిగత విలు వలకు, బ్యాంకులోని కొన్ని విధానాలకు మధ్య విభేదాలున్నాయని పేర్కొంటూ రాజీనామా చేశారు. అయితే, ఆందోళనలకు ఆధా రాలు లేవని బ్యాంకు నియమించిన స్వతంత్ర న్యాయ సమీక్ష తెలిపింది. ప్రస్తుత సీఈఓ శశిధర్ జగదీశన్ మరోసారి పదవిలో కొనసాగేందుకు ఆసక్తి చూపలేదు. డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ కైజాద్ భరూచా కూడా డిసెంబరు చివర్లో వైదొలగాలని నిర్ణయించుకున్నారు.

---

## న్యూజిలాండ్‌లో భువీకి పండగే.. అర్ష్‌దీప్‌కు అలెన్ చిక్కడం ఖాయమంటున్న మాజీ కోచ్!




న్యూజిలాండ్ పిచ్‌లపై భారత పేసర్ భువనేశ్వర్ కుమార్ చెలరేగే అవకాశం ఉందని ముంబయి ఇండియన్స్ మాజీ ఫీల్డింగ్ కోచ్ జేమ్స్ పామెంట్ అన్నాడు. అక్కడి పరిస్థితులు భువీ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటాయని చెప్పాడు. మరోవైపు అర్ష్‌దీప్ సింగ్ తన స్వింగ్‌తో న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్‌ను ఇబ్బంది పెట్టగలడని అంచనా వేశాడు.ఐభారత్, న్యూజిలాండ్ మధ్య గురువారం నుంచి ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో భువనేశ్వర్ నాలుగేళ్ల తర్వాత టీ20 జట్టులోకి తిరిగొచ్చాడు. న్యూజిలాండ్‌లో బంతి సహజంగా స్వింగ్ అవుతుంది. ఈ పరిస్థితులు భువీకి బాగా కలిసొస్తాయని పామెంట్ పేర్కొన్నాడు. భారత పేసర్లు కచ్చితమైన లైన్, లెంగ్త్‌తో బౌలింగ్ చేయాలని అతడు సూచించాడు. అవసరమైనప్పుడు షార్ట్ బాల్స్ వేయాలని చెప్పాడు. న్యూజిలాండ్ బ్యాటర్లు దూకుడుగా ఆడతారని, బౌలర్లు ఏమాత్రం తేలికగా బౌలింగ్ చేసినా భారీగా పరుగులు సమర్పించుకోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. పచ్చిక మైదానాలపై బౌలింగ్ చేసేటప్పుడు బూట్లకు సరైన పట్టుదల ఉండేలా చూసుకోవాలని అన్నాడు. హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌కు దూరం కావడం ఇతర ఆటగాళ్లకు అవకాశమని పామెంట్ అభిప్రాయపడ్డాడు. మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్ తమ సత్తా నిరూపించుకోవచ్చన్నాడు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి కూడా ఇది కీలకమైన సిరీస్ అని చెప్పాడు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించి జట్టుకు ఉపయోగపడాలని సూచించాడు.

# స్పోర్ట్స్

## మైదానంలోనే కన్నీళ్లు పెట్టుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్

భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఎట్టకేలకు తనదైన శైలిలో ఫామ్‌లోకి వచ్చింది. సుదీర్ఘకాలంగా పరుగుల కోసం ఇబ్బంది పడుతున్న ఆమె, నిన్న జింబాబ్వేతో జరిగిన మూడో టీ20లో విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగింది. కేవలం 41 బంతుల్లోనే 10 ఫోర్లు, 5 భారీ సిక్సర్లతో అజేయంగా 91 పరుగులు సాధించింది. అయితే, ఈ అద్భుత ఇన్నింగ్స్ అనంతరం ఆమె తన భావోద్వేగాలను అదుపు చేసుకోలేకపోయింది. మైదానంలోనే కన్నీళ్లు పెట్టుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. గత 10 అంతర్జాతీయ మ్యాచ్‌లుగా హర్మన్‌ప్రీత్ ఒక్క అర్ధశతకం కూడా నమోదు చేయలేకపోయింది. ఇటీవలే ముగిసిన ఆసియా కప్, ఆసియా క్రీడల్లో భారత జట్టు స్వర్ణాలు గెలిచినప్పటికీ, కెప్టెన్సీ నుంచి తప్పుకున్న తర్వాత ఆమె వ్యక్తిగత ప్రదర్శన నిరాశపరిచింది. ఈ నేపథ్యంలో జింబాబ్వేపై ఆడిన ఈ ఇన్నింగ్స్ ఆమెకు ఎంతో ఉపశమనాన్నిచ్చింది. ఇన్నింగ్స్ విరామ సమయంలో బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన ఆమె.. "చాలా సంతోషంగా ఉంది. క్రీజులో సమయం గడపడాన్ని, నా బ్యాటింగ్‌ను ఆస్వాదించాలనుకున్నాను" అని తెలిపింది. అనంతరం భారత జట్టు మాజీ కోచ్ డబ్ల్యూవీ రామన్‌తో మాట్లాడుతూ హర్మన్‌ప్రీత్ ఒక్కసారిగా భావోద్వేగానికి గురైంది. కన్నీళ్లు ఆపుకోలేకపోయింది. "ఈ ఘనతలో మీకు కూడా భాగం ఉంది. జట్టులోకి రాగానే, 'నీకు నచ్చినట్లు ఆడు' అని మీరు చెప్పారు. నేను అదే చేశాను. ఆ మాటలకు ధన్యవాదాలు" అంటూ రామన్ ప్రోత్సాహాన్ని గుర్తుచేసుకుంది.ఈ సందర్భంగా తన పునరాగమనం వెనుక ఉన్న శ్రమను కూడా ఆమె పంచుకుంది. "ఆసియా క్రీడల తర్వాత నెట్స్‌లో చాలా సమయం గడిపాను. నా బ్యాటింగ్‌పై ఎంతో శ్రమించిన నా కోచ్ హిమాన్షు భయ్యాకు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పాలి. నేను ఆడిన ఆటంతా ఆయన చలవే" అని హర్మన్‌ప్రీత్ పేర్కొంది. మొత్తానికి ఈ ఇన్నింగ్స్‌తో హర్మన్‌ప్రీత్ కౌర్ తిరిగి ఫామ్‌లోకి రావడం భారత క్రికెట్ అభిమానులకు సంతోషాన్నిచ్చే విషయం.




# వైభవ్ సూర్యవంశీకి నిరీక్షణ తప్పదు.. కారణం ఇదే: శ్రేయస్ అయ్యర్



టీమిండియా టీ20 జట్టులో సంచలన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కించుకోవడానికి మరికొంత కాలం వేచి చూడక తప్పదని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ స్పష్టం చేశాడు. ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ నిలకడగా రాణిస్తున్నందున, ప్రస్తుతానికి జట్టు కూర్పును మార్చే ఉద్దేశం లేదని తెలిపాడు. న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ముందు శ్రేయస్ ఈ వ్యాఖ్యలు చేశాడు.ఐపీఎల్, అండర్-19 క్రికెట్‌లో అద్భుత ప్రదర్శనతో వెలుగులోకి వచ్చిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ.. ఇప్పటికే 8 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడాడు. అయితే, అవన్నీ విదేశీ గడ్డపైనే కావడం గమనార్హం. స్వదేశంలో అతనికి ఇంకా ఆడే అవకాశం లభించలేదు. దీనిపై శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. "వైభవ్ లాంటి ప్రతిభావంతుడైన ఆటగాడు డ్రెస్సింగ్ రూమ్‌లో సంతోషంగా ఉండటం ముఖ్యం. అతను చాలా చిన్నవాడు, అవకాశాలు అందిపుచ్చుకోవడానికి అతనికి చాలా సమయం ఉంది. మా ఓపెనర్లు నిలకడగా పరుగులు సాధిస్తున్నారు. ప్రపంచకప్ గెలిచిన జట్టులో వారు భాగం. కాబట్టి, వైభవ్ ఇప్పుడే నేరుగా జట్టులోకి రాలేడు" అని వివరించాడు. "నీకు అవకాశం తప్పక వస్తుంది. నీ ప్రక్రియలో స్థిరంగా ఉండు, కొన్నిసార్లు వేచి ఉండాలి అని నేను వైభవ్‌కు చెబుతూ ఉంటాను," అని అయ్యర్ తెలిపాడు.మరోవైపు, దాదాపు నాలుగేళ్ల తర్వాత టీ20 జట్టులోకి తిరిగి వచ్చిన సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ రాకపై శ్రేయస్ అయ్యర్ హర్షం వ్యక్తం చేశాడు. భువీ రాకతో జట్టు బౌలింగ్ విభాగం మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశాడు. "భువనేశ్వర్ తనతో పాటు అపారమైన అనుభవాన్ని జట్టులోకి తీసుకువస్తాడు. గత కొంత కాలంగా మా జట్టులో ఈ అనుభవమే లోపించింది. ముఖ్యంగా ఐపీఎల్ తర్వాత చాలా మంది కొత్త బౌలర్లు జట్టులోకి వచ్చారు. గత రెండేళ్లుగా భువీ కెరీర్ గ్రాఫ్ చూస్తే, అతను ఐపీఎల్ కూడా గెలిచాడు. ఈ ఫార్మాట్‌లో ఎలా ఆధిపత్యం చెలాయి ంచాలో అతనికి బాగా తెలుసు" అని అయ్యర్ పేర్కొ న్నాడు. క్రైస్ట్‌చర్చ్‌లో న్యూజిలాండ్‌తో జరిగే తొలి టీ20తో ఈ సిరీస్ ప్రారంభం కానుంది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com